PRGI NO: APTEL/26/A1204

# కింగ్

డైలీ న్యూస్ పేపర్

King Daily News Paper

విజయవాడ,హైదరాబాద్ సంపుటి 01 సంచిక 76 ఎడిటర్ : కలిదిండి రఘురామ రాజు ఆదివారం 21 జూన్ 2026 వెల -3 పేజీలు -8

## ఏపీ, తెలంగాణకు భారీ వర్ష సూచన.. ఉరుములు, పిడుగులతో ముంచెత్తనున్న వానలు

తెలుగు రాష్ట్రాల్లో నేటి నుంచి చల్లబడనున్న వాతావరణం

రెండు రాష్ట్రాల్లోని పలు జిల్లాలకు భారీ వర్ష సూచన

హైదరాబాద్‌లో రాత్రి పూట మారనున్న వాతావరణం



హైదరాబాద్

# రైతులకు అండగా ఉన్నాం

## స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర, 'పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ'

# రూ.3,125 కోట్లు విడుదల

## సీఎం చంద్రబాబు

## బటన్ నొక్కగానే 99.8 శాతం రైతులకు నిధులు జమ

- మనం ప్రకృతిసేద్యం వైపు మారాలి - సంజీవని ప్రాజెక్టు ద్వారా అందరి ఆరోగ్యాన్ని కాపాడుతాం

- 'స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

2

పల్నాడు జిల్లా చిలకలూరిపేట






## 'నా జీవిత భాగస్వామిగా దొరకడం నా అదృష్టం'.. అర్ధాంగి భువనేశ్వరికి సీఎం చంద్రబాబు భావోద్వేగ బర్త్‌డే విషెస్


భార్య, తల్లి, వ్యాపారవేత్తగా ఆమె మా జీవితాల్లో వెలుగు నింపారని కొనియాడిన సీఎం

భువనేశ్వరి దయ, కరుణ ఎందరికో ఆదర్శమని ప్రశంస

నీలాంటి వ్యక్తి జీవిత భాగస్వామిగా లభించడం నా అదృష్టమంటూ పోస్ట్

2

అమరావతి



## కొత్త ఓటరు నమోదుపై అబద్ధాలు నమ్మకండి: తెలంగాణ 'సర్' ప్రక్రియపై ఎస్ఈవో సుదర్శన్‌రెడ్డి

కొత్త ఓటు హక్కు నమోదు చేసుకునే అవకాశం లేదంటూ తప్పుడు ప్రచారం

బూత్ లెవెల్ ఆఫీసర్లు ప్రతి ఇంటికి వస్తారన్న ఎస్ఈవో సుదర్శన్ రెడ్డి

కొత్త ఓటర్లు వారి వివరాలను నమోదు



చేసుకోవచ్చని క్లారిటీ

తెలంగాణ

తెలంగాణ ఓటర్లకు, యువతకు రాష్ట్ర ఎన్నికల

2

## క్రిమినల్స్‌కు కులం లేదు.. వైసీపీ గూండాలను తొక్కి నార తీస్తా:

## పవన్ కల్యాణ్ స్ట్రాంగ్ వార్నింగ్

క్రిమినల్‌కు కులం, మతం, ప్రాంతం ఉండవని స్పష్టం చేసిన పవన్

వైసీపీ రౌడీ మూకలు, గుండాల పిచ్చి వేషాలు తమ వద్ద చెల్లవని తీవ్ర హెచ్చరిక

శాంతిభద్రతల విషయంలో పోలీసుల విధుల్లో జోక్యం చేసుకోనని హామీ

తప్పుడు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను ఉపేక్షించవద్దని అధికారులకు సూచన

నేరాలకు వ్యతిరేకంగా పౌరులు ఏకమై పోరాడాలని పిలుపునిచ్చిన డిప్యూటీ సీఎం



కాకినాడ

2

## రూ.లక్షా పదివేల కోట్ల ఆస్తులు కాపాడాం.. మాపై దుష్ప్రచారం ఆపండి: హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైడ్రాకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారంటూ రంగనాథ్ ఆగ్రహం

హైడ్రాను బద్నాం చేసేందుకు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపాటు

సిటీలో ఇప్పటి వరకు 600 ఆపరేషన్స్ పూర్తి చేశామని వెల్లడి

తమకు రాజకీయ పార్టీలతో సంబంధం లేదన్న రంగనాథ్

హైడ్రా ఎప్పుడూ మౌనంగా ఉండదని స్పష్టీకరణ

హైదరాబాద్

హైదరాబాద్ లో ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్న 'హైడ్రా'పై గత కొన్ని రోజులుగా వ్యతిరేక ప్రచారం జరుగుతోందంటూ ఆ సంస్థ కమిషనర్ ఏవీ రంగనాథ్

2



# పీఎం కిసాన్ 23వ విడత నిధులను విడుదల చేసిన ప్రధాని మోదీ

9.44 కోట్ల మంది రైతుల ఖాతాల్లోకి రూ. 18,880 కోట్లు జమ

ప్రతి లబ్ధిదారునికి రూ. 2,000 చొప్పున ఆర్థిక సాయం

పశ్చిమ బెంగాల్‌లోని తారకేశ్వర్ నుంచి నిధుల బదిలీ కార్యక్రమం

పశ్చిమ బెంగాల్

ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం–కిసాన్) పథకంలో భాగంగా 23వ విడత నిధులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం విడుదల చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లా తారకేశ్వర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన బటన్ నొక్కి, ఈ నిధులను నేరుగా రైతుల ఖాతాల్లోకి బదిలీ చేశారు. ఈ విడత కింద దేశవ్యాప్తంగా 9.44 కోట్లకు పైగా అర్హులైన రైతు కుటుంబాల బ్యాంకు ఖాతాల్లోకి మొత్తం రూ. 18,880 కోట్లకు పైగా నగదు జమ అయింది.

'పీఎం కిసాన్ ఉత్సవ్ దివస్' సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో, ప్రతి లబ్ధిదారునికి రూ. 2,000 చొప్పున ఆర్థిక సాయం అందింది. వ్యవసాయ పనులతో పాటు ఇతర కుటుంబ అవసరాలకు ఈ మొత్తం రైతులకు సకాలంలో అండగా నిలుస్తుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. 2019 ఫిబ్రవరిలో ప్రారంభమైన ఈ పథకం ద్వారా చిన్న, సన్నకారు రైతులకు ఏటా రూ. 6,000

2



## విశాఖ పర్యటనకు రానున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

జూన్ 30న విశాఖకు వస్తున్న రాష్ట్రపతి

కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ప్రథమ స్నాతకోత్సవంలో పాల్గొననున్న రాష్ట్రపతి

కార్యక్రమంలో పాల్గొననున్న గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు

విశాఖ

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జూన్ 30వ తేదీన విశాఖపట్నం పర్యటనకు రానున్నారు. ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ప్రథమ స్నాతకోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ మేరకు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ టి. శ్రీనివాసన్ అధికారికంగా ప్రకటించారు. ఈ ప్రథమ

2



# ‘పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ’ రూ.3,125 కోట్లు విడుదల

రైతులకు ప్రతి విషయంలో అండగా ఉన్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. గతంలో ధాన్యం కొని ఆరు నెలలైనా డబ్బులు వచ్చేవి కావన్నారు. కానీ కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో డబ్బులు ఇస్తోందన్నారు. రైతు బాగుంటే గ్రామీణ ఆర్థికవ్యవస్థ బాగుంటుందన్నారు. వైఎస్సార్సీపీ హయాంలో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. భూమి తల్లితో సమానం, అలాంటి భూమికి ఎక్కువ యూరియా వేస్తున్నామని తెలిపారు.

తాత్కాలిక ప్రయోజనం కోసం రైతులు ఎక్కువ యూరియా వినియోగిస్తున్నారన్నారు. ఎక్కువ రసాయనాలు వినియోగిస్తే, ఇతర దేశాలు మన ఉత్పత్తులను దిగుమతి చేసుకోవన్నారు. మన ఉత్పత్తులను ఇతర దేశాలు దిగుమతి చేసుకోకపోతే నష్టం జరుగుతోందన్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం లింగంగుంట్లలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర, ‘పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ’ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరయ్యారు.   విధ్వంసం నుంచి వికాసంవైపు : “ రాయలసీమ హార్టికల్చర్ హబ్‌గా తయారైంది. రైతులకు లాభసాటిగా ఉండాలని పామాయిల్ పంటను ప్రోత్సహిస్తున్నాం. పామాయిల్ పంటలో అంతర్గత పంటలూ వేసుకోవచ్చు. నా జీవితంలో ఇవాళ్టికి మించిన ఆనందం మరొకటి లేదు. ఇవాళ మూడు మంచి కార్యక్రమాల్లో పాల్గొన్నాను. యోగా, స్వచ్ఛాంధ్ర, అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో పాల్గొన్నాను. సంపద సృష్టించి, మీ కష్టాలు తీరుస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చాం. పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ.7 వేలు జమ చేశాం. పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ కింద రూ.3,125 కోట్లు విడుదల చేశాం. బటన్ నొక్కగానే 99.8 శాతం రైతులకు నిధులు జమయ్యాయి. రైతులకు ఏటా రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చి నిలబెట్టుకున్నాం. గత ప్రభుత్వం ఆర్థిక విధ్వంసం సృష్టించింది. విధ్వంసం నుంచి వికాసం వైపు తీసుకెళ్తామని మీకు హామీ ఇచ్చాం. మమ్మల్ని నమ్మి 95 శాతం మంది ఎన్డీఏ అభ్యర్థులను గెలిపించారు“ అని చంద్రబాబు తెలిపారు.

“రైతులకు లాభసాటిగా ఉండాలని పామాయిల్ పంటను ప్రోత్సహిస్తున్నాం. పామాయిల్ పంటలో అంతర్గత పంటలూ వేసుకోవచ్చు. మనం ప్రకృతిసేద్యం వైపు మారాలి. సంజీవని ప్రాజెక్టు ద్వారా అందరి ఆరోగ్యాన్ని కాపాడుతాం. ఒకప్పుడు ఆంధ్రా అంటే వరి, తెలంగాణ అంటే మెట్ట పొలాలు. ఇప్పుడు ఆంధ్రాను డామినేట్ చేసి తెలంగాణ వరిని పండిస్తోంది. రైతులను కాపాడేందుకు ఎంతై ఖర్చైనా వెనుకాడబోం. రొయ్యల ఫీడ్ ధరను కిలోకు రూ.12 పెంచితే, రూ.8కి తగ్గించాం. కిలో తోతాపుర మామిడికి రూ.4 ఇస్తున్నాం. రైతులను కాపాడుకునే బాధ్యత మా ప్రభుత్వం తీసుకుంటుంది.“ - చంద్రబాబు, సీఎం  రైతులతో ముఖాముఖి : అంతకుముందు లింగంగుంట్ల గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సీఎం చంద్రబాబు సందర్శించారు. నెట్ జీరో కాన్సెప్టులో భాగంగా అంగన్వాడీలకు ఇండక్షన్ స్టవ్‌లను సీఎం పంపిణీ చేశారు. అంగన్వాడీ కేంద్రానికి ఇండక్షన్ స్టవ్, స్టీల్ పాత్రలు అందించారు. అనంతరం స్వయంగా రాగిజావ తయారుచేసి సీఎం చంద్రబాబు చిన్నారులకు ఇచ్చి, తానూ తాగారు. తరువాత చిన్నారులతో మమేకమైన సీఎం, వారితో కలిసి కింద కూర్చునే కాసేపు వారితో ముచ్చటించారు. తరువాత పచ్చదనం పెంపులో భాగంగా అంగన్వాడీ కేంద్రం ప్రాంగణంలో మొక్కను నాటారు. అనంతరం రైతులతో ముఖాముఖి నిర్వహించారు. లింగంగుంట్లలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన సీఎం, గానుగ ఎక్కి వేరుశెనగ, కొబ్బరినూనె ఉత్పత్తిని పరిశీలించారు. వ్యవసాయ క్షేత్రంలో రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో సీఎం చంద్రబాబు విత్తనాలు నాటారు. ఆ తర్వాత టీడీపీ కార్యకర్తలు, నేతలతో సమావేశమయ్యారు.

# అర్ధాంగి భువనేశ్వరికి సీఎం చంద్రబాబు భావోద్వేగ బర్త్‌డే విషెస్

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన అర్ధాంగి నారా భువనేశ్వరికి హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని, ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నారు. భువనేశ్వరిని తన జీవితంలో వెలుగుగా అభివర్ణిస్తూ ప్రశంసలు కురిపించారు.

“భార్యగా, తల్లిగా, వ్యాపారవేత్తగా మా అందరి జీవితాల్లో వెలుగు నింపే భువనేశ్వరికి పుట్టినరోజు శుభాకాంక్షలు“ అంటూ చంద్రబాబు తన పోస్ట్‌లో పేర్కొన్నారు. “నీ దయ, కరుణ, సానుకూల దృక్పథం ఎందరికో స్ఫూర్తినిచ్చాయి. నీ ఔదార్యంతో ఇతరులను ఉన్నత స్థానంలో నిలబెడతావు. నువ్వు చేపట్టే ప్రతి పాత్రకు అందాన్ని, ప్రయోజనాన్ని చేకూరుస్తావు“ అని కొనియాడారు.

“నీలాంటి అద్భుతమైన వ్యక్తి నా జీవిత భాగస్వామిగా లభించడం నా అదృష్టం. నీ బలం, ఆప్యాయత, మరెన్నో విధాలుగా నువ్వు ప్రతిరోజూ మా జీవితాలను ప్రకాశవంతం చేస్తున్నందుకు ధన్యవాదాలు. ఈ ఏడాది నీకు అద్భుతంగా ఉండాలని కోరుకుంటున్నాను“ అని చంద్రబాబు తన పోస్టులో పేర్కొన్నారు. పలువురు ప్రముఖులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా భువనేశ్వరికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

# క్రిమినల్స్‌కు కులం లేదు.. వైసీపీ గూండాలను తొక్కి నార తీస్తా:

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని, నేరస్తులకు కులం, మతం, ప్రాంతం వంటివి అంటగట్టి వెనకేసుకొచ్చే సంస్కృతికి చరమగీతం పాడతామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. నేరాలకు పాల్పడింది తన పార్టీ నాయకులైనా సరే ఉపేక్షించేది లేదని, పోలీసుల విధుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ జోక్యం చేసుకోనని హామీ ఇచ్చారు. కాకినాడలో జరిగిన ‘మన ఊరు - మాట మంతి‘ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, గత ఐదేళ్ల పాలనలో వ్యవస్థలను నిర్వీర్యం చేశారని, క్రిమినల్స్‌ను ప్రోత్సహించారని తీవ్రస్థాయిలో విమర్శించారు. ముఖ్యంగా వైసీపీకి చెందిన రౌడీ మూకలను, గుండాలను తొక్కి నార తీస్తాను అంటూ తీవ్ర పదజాలంతో హెచ్చరించారు.

వైసీపీ గుండాలకు బహిరంగ హెచ్చరిక

“రక్తపాతం సృష్టిస్తాం, కుత్తుకలు కోస్తాం అని విర్రవీగుతున్న ప్రతి వైసీపీ గుండాకు కెమెరా సాక్షిగా చెబుతున్నా. మీ పిచ్చి వేషాలు మా దగ్గర చెల్లవు. ప్రభుత్వాలు వస్తుంటాయి, పోతుంటాయి. ప్రజల చేతిలో నిర్ణయం ఉంటుంది. ఒకవేళ మీ ప్రభుత్వమే వచ్చినా సరే, మిమ్మల్ని తొక్కి నార తీస్తాను, గుర్తుపెట్టుకోండి. గతంలో వైసీపీకి పనిచేశామని ఇప్పటికీ విధేయత చూపిస్తున్న కొందరు అధికారులపై ప్రత్యేక దృష్టి పెడతాను“ అని పవన్ తీవ్రంగా హెచ్చరించారు.

“దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాజకీయాల్లోకి వచ్చాను. పదవుల కోసం కాదు. కాకినాడలో ఛార్జ్ తీసుకున్న తర్వాత ఎవరు ఎస్పీగా, కలెక్టర్‌గా ఉండాలో నేను నిర్దేశించలేదు. వ్యవస్థలను బలోపేతం చేయండి, నా నుంచి ఒక్క ఫోన్ కాల్ కూడా రాదని వారికి చెప్పాను. నా పార్టీ వాళ్లను పట్టుకున్నా వదలమని చెప్పను. ఎమ్మెల్సీ తన డ్రైవర్‌ను చంపేస్తే జైలుకు వెళ్లి అభినందించే వ్యక్తిని నేను కాదు. తెలిసి తెలియని వయసులో 23 నేరాలు చేసిన వాడ్ని కూడా పసిపిల్లవాడని వెనకేసుకొచ్చే నాయకుడిని కాదు“ అని పవన్ పరోక్ష వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి నేరపూరిత భావజాలాన్ని ప్రోత్సహిస్తే భవిష్యత్తు ఊహకు అందకుండా తయారవుతుందని ప్రజలను హెచ్చరించారు.

శాంతిభద్రతల పునరుద్ధరణే లక్ష్యం

శాంతిభద్రతలు పటిష్టంగా ఉంటేనే పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాలు వస్తాయని, సమాజం సవ్యంగా ముందుకు సాగుతుందని పవన్ కల్యాణ్ అన్నారు. “లా అండ్ ఆర్డర్ అనేది కేవలం ప్రభుత్వ విధి మాత్రమే కాదు, నాగరిక సమాజానికి అది పునాది. అది లేకపోతే సంక్షేమం, ఉద్యోగాలు, వ్యాపారాలు అన్నీ కుప్పకూలిపోతాయి. రూల్ ఆఫ్ లాను బలంగా నిలబెట్టాల్సిన బాధ్యత అధికారులదే. ఏ విషయంలోనైనా ఒత్తిడి తీసుకువచ్చేలా నా నుంచి ఒక్క ఫోన్ కాల్ కూడా రాదు“ అని ఎస్పీ, కలెక్టర్లను ఉద్దేశించి అన్నారు.

క్రిమినల్స్‌కు కులం రంగు పులమొద్దు

కొందరు నేరస్తులకు కులం రంగు పులిమి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని, ఇది రాష్ట్ర భవిష్యత్తుకు అత్యంత ప్రమాదకరమని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. “ఆంధ్రప్రదేశ్‌కు పట్టిన కులం దరిద్రం వదిలితే తప్ప రాష్ట్రం బాగుపడదు. క్రిమినల్‌కు కులం ఉండదు. అత్యాచారం చేసేవాడికి, దోపిడీ చేసే నీచుడికి కులం ఎందుకు ఉంటుంది? అలాంటి వారిని వెనకేసుకొస్తే అది ఆ వ్యక్తి నైజాన్ని తెలుపుతుంది. ఎమ్మెల్సీ అనంతబాబు ఒక దళిత డ్రైవర్‌ను హత్య చేస్తే, అది కాపులందరికీ చెడ్డపేరు అవుతుందా? ప్రతిదానికీ కులాన్ని లాగడం సరికాదు“ అని ఆయన ప్రశ్నించారు. సుగాలి ప్రీతి, వివేకానంద రెడ్డి హత్య కేసుల్లో గత ప్రభుత్వం సాక్ష్యాలను నాశనం చేయడం వల్లే నేరస్తులకు శిక్ష పడటం కష్టమవుతోందని అన్నారు.

తప్పుడు ఎస్సీ, ఎస్టీ కేసులపై కఠినంగా ఉండాలి

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తున్నారని పవన్ విమర్శించారు. “నిజమైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను ఎంత బలంగా ఎదుర్కొంటామో, తప్పుడు కేసులను కూడా అంతే బలంగా నిలువరించాలి. బాబాసాహెబ్ అంబేద్కర్ మీద గౌరవం ఉన్నవారెవరూ తప్పుడు కేసులు పెట్టరు. సుప్రీంకోర్టు కూడా దీనిపై స్పందించిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. మా కూటమి నాయకులు కూడా ఇలాంటి వాటిని ప్రోత్సహించవద్దు“ అని విజ్ఞప్తి చేశారు.

పౌర సమాజం మేల్కొనాలి

ప్రజలు కూడా తమ బాధ్యతను గుర్తించాలని, తమ ప్రాంతాల్లో జరిగే అన్యాయాలపై గొంతెత్తాలని పవన్ పిలుపునిచ్చారు. “కుల సంఘాలకు వాట్సాప్ గ్రూపులు ఉన్నప్పుడు, శాంతిభద్రతల కోసం ఎందుకు లేవు? మీ వీధిలో 30-40 మంది కలిసి ఒక గ్రూప్‌గా ఏర్పడండి. సిటిజన్ కౌన్సిల్స్ ఏర్పాటు చేసుకోండి. మీరు బలంగా నిలబడితే, ఏ క్రిమినల్ కూడా తలెత్తడానికి భయపడతాడు. జనసేన ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా లా అండ్ ఆర్డర్ సమస్యలపై ఎక్కడికక్కడ గొంతెత్తాలి. నన్ను కులానికి పరిమితం చేయొద్దు“ అని చేతులెత్తి నమస్కరిస్తూ కోరారు. వ్యవస్థాగత వైఫల్యం వల్లే ఒక ఎస్పై పరిష్కరించాల్సిన సమస్య డిప్యూటీ సీఎం వద్దకు వస్తోందని, ఇలాంటి పరిస్థితులను మార్చడానికే తాను కట్టుబడి ఉన్నానని పవన్ కల్యాణ్ పునరుద్ఘాటించారు.

# ఏపీ, తెలంగాణకు భారీ వర్ష సూచన.. ఉరుములు, పిడుగులతో ముంచెత్తనున్న వానలు

తెలుగు రాష్ట్రాల్లో వాతావరణం ఎప్పుడు ఎలా మారుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే రుతుపవనాలు ఎంట్రీ ఇచ్చినా, అక్కడక్కడ మాత్రమే వర్షాలు కురిశాయి.. అయితే, నేటి నుంచి వాతావరణం పూర్తిగా చల్లబడనుందని, ఇరు రాష్ట్రాల్లో పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఏపీలోని ఉత్తరాంధ్ర, దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాలపై వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండబోతోంది. ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, విశాఖపట్నం, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కడప, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన భారీ వర్షాలు పడే ఛాన్స్ ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తరు వానలు కురుస్తాయి. తెలంగాణలో నేడు ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. ముఖ్యంగా సెంట్రల్, దక్షిణ తెలంగాణ జిల్లాలపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుంది. సంగారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి, మెదక్, సిద్దిపేట్, మహబూబ్ నగర్, వనపర్తి, నాగర్ కర్నూల్, నారాయణ్ పేట్, నల్గొండ, యాదాద్రి భువనగిరి, జనగాం, కామారెడ్డి జిల్లాల్లో సాయంత్రం నుండి అర్ధరాత్రి సమయంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

హైదరాబాద్‌లో కూడా పగటిపూట ఎండ ఉన్నప్పటికీ.. రాత్రి సమయంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయి ఉరుములు, పిడుగులతో కూడిన వర్షాలు పడే ముప్పు ఉందని వెదర్ రిపోర్ట్స్ చెబుతున్నాయి.

# పీఎం కిసాన్ 23వ విడత నిధులను విడుదల చేసిన ప్రధాని మోదీ

చొప్పున మూడు విడతల్లో ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. తాజా విడుదలతో కలిపి ఈ పథకం కింద ఇప్పటివరకు రూ. 4.46 లక్షల కోట్లకు పైగా నిధులను పంపిణీ చేసినట్లు అధికారులు వెల్లడించారు.

ఈ విడతలో పశ్చిమ బెంగాల్‌లోని 45.35 లక్షల మంది రైతులకు రూ. 907 కోట్లు, గుజరాత్‌లోని 51.28 లక్షల మంది రైతులకు రూ. 1,025 కోట్లు అందాయి. దేశవ్యాప్త లబ్ధిదారులలో 2.18 కోట్లకు పైగా మహిళా రైతులు ఉండటం గమనార్హం. పథకం ప్రయోజనాలను సక్రమంగా పొందేందుకు రైతులు తమ ఈ-కేవైసీ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు. లబ్ధిదారులు తమ పేరును జాబితాలో తనిఖీ చేసుకునేందుకు జూఎిఆయిఖఅ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌లోని ‘ఫార్మర్స్ కార్నర్‘ను సందర్శించవచ్చు.

# రూ.లక్షా పదివేల కోట్ల ఆస్తులు కాపాడాం.. మాపై దుష్ప్రచారం ఆపండి: హైడ్రా కమిషనర్ రంగనాథ్

తీవ్రంగా స్పందించారు. కొందరు పనిగట్టుకుని తమ సంస్థను బద్నాం చేయడానికి దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈరోజు హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన హైడ్రా యాక్షన్ ప్లాన్, ఇప్పటివరకు సాధించిన విజయాలపై పక్కా లెక్కలతో క్లారిటీ ఇచ్చారు

హైడ్రా కేవలం కూల్చివేతలకే పరిమితం కాలేదని, ఇప్పటివరకు సిటీలో దాదాపు 600 ఆపరేషన్స్ పూర్తి చేసి, ఆక్రమణదారుల గుప్పిట్లో ఉన్న సుమారు లక్షా పదివేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తులను, చెరువులను, పార్కులను కాపాడామని రంగనాథ్ వెల్లడించారు. దోపిడీకి గురికాకుండా ఉండాలనే ఆకాంక్షతోనే ప్రత్యేక తెలంగాణ కోసం ఇక్కడి ప్రజలు కొట్లాడారని, ఆ ఆశయాలకు అనుగుణంగానే ప్రభుత్వ ఆస్తులను రక్షిస్తున్నామని చెప్పారు.

“రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చింది. మాకు రాజకీయ పార్టీలతో సంబంధం లేదు. ఎంఐఎం అయినా, అధికార కాంగ్రెస్ అయినా మాకు ఒకటే. ఫాతిమా కాలేజీ లాంటి విద్యాసంస్థలు భాగ్యనగరంలో చాలా ఉన్నాయి. చట్టం అందరికీ సమానమే. హైడ్రా ఎప్పుడూ సైలెంట్‌గా ఉండదు. అలాగని రాత్రికి రాత్రి వచ్చి ఇళ్లను కూల్చేస్తుందనేది అవాస్తవం“ అని స్పష్టం చేశారు.

గుడిసెలు వేసుకున్న వారిలో నిజమైన పేదలు ఎవరు అనేది పరిశీలిస్తామని, వారికి ప్రభుత్వం తరఫున డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించిన తర్వాతే తదుపరి చర్యలు ఉంటాయని మానవీయ కోణంలో మాట్లాడారు. ఇటీవల హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షానికి నగరం అతలాకుతలం అయిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఆక్రమణల వల్లే నాలాలు పూడిపోయి ఈ పరిస్థితి వచ్చిందన్నారు. “లక్ష మంది ప్రజలకు మంచి చేయాలన్నప్పుడు.. కొంతమంది ఆక్రమణదారులకు చెడు జరగక తప్పదు. ఒకవేళ హైడ్రా వైపు ఏమైనా తప్పు ఉంటే క్షమాపణ చెప్పడానికి కూడా సిద్ధమే. తప్పులు జరిగితే సరిదిద్దుకుంటూ ముందుకెళతాం. హైడ్రా పొలిటికల్ సెటిల్‌మెంట్లకు అడ్డాగా మాత్రం మారదు“ అని తేల్చిచెప్పారు.

# విశాఖ పర్యటనకు రానున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

స్నాతకోత్సవంలో 2021 నుండి 2026 విద్యా సంవత్సరాల మధ్య తమ కోర్సులు, ప్రోగ్రామ్‌లు విజయవంతంగా పూర్తి చేసుకున్న సుమారు 400 మంది విద్యార్థులకు రాష్ట్రపతి స్వయంగా డిగ్రీ పట్టాలను అందజేయనున్నారు. వీరితో పాటు వివిధ విభాగాల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన 15 మంది టాపర్లకు గోల్డ్ మెడల్స్ కూడా ప్రదానం చేయనున్నారు.

రాష్ట్రపతితో పాటు ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, రాష్ట్ర ఐటీ అండ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. దేశ ప్రథమ పౌరురాలైన రాష్ట్రపతితో పాటు సీఎం, గవర్నర్ ఒకే వేదికపైకి వస్తుండటంతో విశాఖ జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. భారీ భద్రతా ఏర్పాట్లను చేస్తోంది.

# పోక్సో కేసు.. బండి సంజయ్ కొడుకు భగీరథ్‌కు బెయిల్

**పోక్సో కేసులో నెల రోజులుగా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న భగీరథ్**

**షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన మల్కాజ్‌గిరి కోర్టు**

**రెండు తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారిన భగీరథ్ వ్యవహారం**

తెలంగాణ

తెలంగాణలో గత నెల రోజులుగా హాట్ టాపిక్‌గా ఉన్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. భగీరథ్‌కు ఎట్టకేలకు మల్కాజ్‌గిరి కోర్టులో ఊరట లభించింది. దాదాపు నెల రోజులుగా చర్లపల్లి జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న అతనికి న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది.  ఒక మైనర్ బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో భగీరథ్‌పై కఠినమైన పోక్సో కేసు నమోదైన సంగతి తెలిసిందే. కేంద్ర మంత్రి కొడుకు కావడం, పైగా సున్నితమైన కేసు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ అంశం పెద్ద చర్చనీయాంశంగా మారింది. కొన్ని రోజులు అజ్ఞాతంలోకి వెళ్లిన భగీరథ్.. మే 17న పోలీసుల ముందుకు వచ్చి సరెండర్ అయ్యాడు. ఆ తర్వాత మేడ్చల్ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించడంతో చర్లపల్లి జైలుకు తరలించారు. బెయిల్ పిటిషన్లు తిరస్కరణకు గురవడంతో నెల రోజులకు పైగా జైల్లోనే గడపాల్సి వచ్చింది. తాజాగా ఇంజినీరింగ్ పరీక్షల నేపథ్యంలో, భగీరథ్ కు కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. దీంతో, భగీరథ్ జైలు నుంచి బయటకు రానున్నారు.

# నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత... ఏఈ రాజశేఖర్.

రుద్రవరం. ,(కింగ్ )

నేడు రుద్రవరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏ ఈ రాజశేఖర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ
రుద్రవరం సబ్ స్టేషన్ క్రింద ఉన్న రైతులకు తెలియజేయడం ఏమనగా 21 వ తేదిన 3 వ ఆదివారం కనుక రుద్రవరం సబ్ స్టేషన్ మెయింటనెన్స్ కలదు కావున ఉదయం 09-00 గంటల నుండి మధ్యాహ్నం 01-00 గంటల వరకు సప్లై ఉండదు .కావున ప్రజలు సహకరించవలసినదిగా కోరడమైనది, అలాగే త్రీ ఫేస్ సప్లై టైం ని కూడా చేంజ్ చేయడం జరిగినది టైం 03-00 టు 09-00 :- 06-00 గంటలు మిగిలిన మూడు గంటల సప్లై షట్ డౌన్ పూర్తి అయిపోయిన తరువాత సప్లై ఇవ్వడం జరుగుతుందని ఏఈ తెలిపారు.

# రైతులు ఉద్యానవన పంటలు సాగు చేయాలి.




రుద్రవరం. ,(కింగ్ )

రైతులు సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా, మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న ఉద్యాన పంటల సాగు వైపు అడుగులు వేయాలని నంద్యాల జిల్లా ఉద్యానశాఖ అధికారి యు. నాగరాజు పిలుపునిచ్చారు. శనివారం ఆయన ఉద్యాన అధికారి దస్తగిరి సిబ్బందితో కలిసి ఆలమూరు , మిట్టపల్లి గ్రామాల్లో పర్యటించి, అక్కడ సాగవుతున్న ఆయిల్ పామ్, అరటి, నేరేడు తోటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.
ఈ సందర్భంగా ఆయన రైతుల సాగు పద్ధతులను అడిగి తెలుసుకుని, నాణ్యమైన దిగుబడుల కోసం పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్యాక్ హౌస్ యూనిట్లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి యు. నాగరాజు మాట్లాడుతూ:లిలి
ఆయిల్ పామ్, నేరేడు సాగుతో స్థిరమైన ఆదాయం.. ప్రస్తుతం మార్కెట్‌లో ఆయిల్ పామ్ మరియు నేరేడు పంటలకు దేశీయంగా మంచి డిమాండ్ ఉందన్నారు. ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకుంటూ ఈ పంటలను సాగు చేయడం ద్వారా రైతులు దీర్ఘకాలికంగా స్థిరమైన రాబడిని పొందవచ్చని పేర్కొన్నారు. ప్యాక్ హౌస్, కోల్డ్ స్టోరేజ్ ప్రాధాన్యత:కోత కోసిన తర్వాత పంట దెబ్బతినకుండా ఉండేందుకు ప్యాక్ హౌస్‌లు, కోల్డ్ స్టోరేజ్ (శీతల గిడ్డంగులు) ఎంతో కీలకంగా మారాయన్నారు. వీటి ద్వారా పంట కాలపరిమితిని పెంచి, మార్కెట్‌లో సరైన ధర వచ్చే వరకు నిల్వ ఉంచుకునే వీలుంటుందని తెలిపారు. వాల్యూ అడిషన్ (విలువ జోడింపు) ఎంతో ముఖ్యం:ఉద్యాన పంటలలో 'వాల్యూ అడిషన్' ప్రాధాన్యతను రైతులు గుర్తించాలన్నారు. నేరేడు వంటి పండ్లను నేరుగా తక్కువ ధరకు అమ్ముకోకుండా.. పల్ప్, జెల్లీలు, లేదా ప్యాకేజ్డ్ జ్యూస్‌లుగా మార్చడం ద్వారా లేదా గ్రేడింగ్, బ్రాండింగ్ చేయడం ద్వారా నాలుగింతలు ఎక్కువ లాభాలను ఆర్జించవచ్చని స్పష్టం చేశారు.

# మధ్యాహ్న భోజనం-విద్యార్థుల వడ్డింపు.


## భోజనాన్ని వడ్డిస్తున్న విద్యార్

రుద్రవరం. ,(కింగ్ )



నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని లక్ష్యంతో ప్రభుత్వము మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తుంది. మధ్యాహ్న భోజనాన్ని ఏజెన్సీ నిర్వాహకులు విద్యార్థులకు వడ్డించాల్సి ఉంది. ఇందుకు విరుద్ధంగా కొన్ని పాఠశాలలో ఏజెన్సీ నిర్వాహకులు భోజనం వడ్డించకపోవడంతో విద్యార్థులే వడ్డించుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే
మండలంలోని హరినగరం ప్రాథమిక పాఠశాల లో శనివారం మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులే వడ్డించుకోవాల్సిన దుస్థితి పాఠశాలలో నెలకొంది. హరినగరం ప్రాథమిక పాఠశాలలో 59 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా వంట ఏజెన్సీ వారు వండి విద్యార్థులకు వారే స్వయంగా వడ్డించాల్సి ఉంది. అయితే శనివారం మధ్యాహ్న భోజనం సమయంలో ఏజెన్సీ ఒక్కరే ఉండడంతో ఏకంగా ప్రధాన, ఉపాధ్యాయుల సమక్షంలోనే విద్యార్థులే స్వయంగా వేడి వేడి భోజనాన్ని వేడి కూరను వడ్డించారు. ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకంలో ఉత్తమమైన లక్ష్యంతో ముందుకు వెళ్తుంటే అందుకు విరుద్ధంగా ఉంటూ ఏజెన్సీల నిర్లక్ష్యమో, లేక ఉపాధ్యాయుల నిర్లక్ష్యమో తెలియదు గానీ పిల్లలే ప్రతిదినం మధ్యాహ్న భోజన సమయంలో ఎవరో ఒకరు పనిభారం మోయాల్సి వస్తుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

# గతాన్ని పూర్తిగా మర్చిపోవాలి: శోభిత ధూళిపాళ



మీ జీవితంలో ఏ విషయాన్ని మర్చిపోవాలనుకుంటున్నారంటూ శోభితకు ప్రశ్న
నిన్నటి వరకు తన జీవితంలో జరిగిన ప్రతి విషయాన్ని మర్చిపోవాలనుకుంటున్నానన్న శోభిత
చేదు జ్ఞాపకాలను మర్చిపోయినప్పుడే ఫ్రీగా ముందుకు సాగుతామని వ్యాఖ్య
అక్కినేని నాగచైతన్యతో వివాహం జరిగిన తర్వాత సినిమాలకు కాస్త బ్రేక్ ఇచ్చిన శోభిత ధూళిపాళ.. రీసెంట్‌గా 'చీకటిలో' వెబ్‌సిరీస్‌తో డిజిటల్ స్క్రీన్‌పై మంచి థ్రిల్ ఇచ్చారు. ప్రస్తుతం కోలీవుడ్ క్రేజీ డైరెక్టర్ పా రంజిత్ తెరకెక్కిస్తున్న సైన్స్ ఫిక్షన్ డ్రామా 'వెట్టువం' షూటింగ్‌తో బిజీగా ఉన్న ఈ బ్యూటీ... తాజాగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో చేసిన కొన్ని పర్సనల్ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతమైన చర్చకు దారితీశాయి.
ఇంటర్వ్యూలో భాగంగా యాంకర్ శోభితను ఒక పర్సనల్ క్వశ్చన్ అడిగారు. "మీ లైఫ్‌లో ఏ విషయాన్ని పూర్తిగా మర్చిపోవాలని అనుకుంటున్నారు?" అని ప్రశ్నించగా... దానికి శోభిత ఏమాత్రం తడబడకుండా.. "నిన్నటి వరకు నా జీవితంలో జరిగిన ప్రతి సంఘటనను, జ్ఞాపకాన్ని పూర్తిగా మర్చిపోవాలని అనుకుంటున్నాను" అని ఆన్సర్ ఇచ్చి అందరినీ ఆశ్చర్యపరిచారు.
తన సమాధానానికి గల కారణాన్ని వివరిస్తూ.. ''సాధారణంగా లోకం మతిమరుపును ఒక జబ్బుగా చూస్తుంది. కానీ నా దృష్టిలో కొన్నిసార్లు మతిమరుపు అనేది మనిషికి దొరికే ఒక గొప్ప వరం. ఎందుకంటే లైఫ్‌లో వేరే వాళ్లు మన పట్ల చేసిన బాధాకరమైన పనులు, మన మనసును గాయపరిచిన చేదు జ్ఞాపకాలను మనం మర్చిపోయినప్పుడే జీవితంలో ఫ్రీగా ముందుకు సాగడం సాధ్యమవుతుంది" అని చెప్పుకొచ్చారు. పాత జ్ఞాపకాలలోనే ఎప్పుడూ కూరుకుపోకుండా, వాటన్నింటినీ డిలీట్ చేసేసి రేపటి భవిష్యత్తు గురించి పాజిటివ్‌గా ఆలోచించడమే నేటి అవసరమని శోభిత క్లారిటీ ఇచ్చారు.

## దళిత యువకుడు పేరు పోగు క్రాంతి మరణ ఘటనపై ప్రభుత్వం స్పందించిన తీరు హర్షం - కూటమి ప్రభుత్వ బాధ్యతాయుత పాలనకు నిదర్శనం - విజయలక్ష్మి

# టిడిపి పట్టణ కోశాధికారి విజయలక్ష్మి

ఎమ్మిగనూరు ,(కింగ్ )



దళిత యువకుడు పేరుపోగు క్రాంతి మరణ ఘటన రాష్ట్రవ్యాప్తంగా ఆవేదన కలిగించింది అని ఆ కుటుంబం కి ప్రగాఢ సానుభూతి ని టిడిపి పార్టీ పట్టణ కోశాధికారి విజయలక్ష్మి పేర్కొన్నారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ ఘటనపై కూటమి ప్రభుత్వం అత్యంత బాధ్యతాయుతంగా స్పందించి, వాస్తవాలను వెలికితీయడానికి తక్షణ చర్యలు చేపట్టడం ప్రజాస్వామ్య పాలనకు నిదర్శనం అని అన్నారు. ఘటన జరిగిన తక్షణమే ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా, పూర్తి స్థాయి విచారణకు ఆదేశించడంతో పాటు బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు ప్రారంభించిందని పోలీస్ అధికారుల విధి నిర్వహణలో లోపాలు ఉన్నాయనే ఆరోపణల నేపథ్యంలో సంబంధిత సీఐపై చర్యలు తీసుకోవడం, ప్రభుత్వం ఎలాంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా నిష్పాక్షికంగా వ్యవహరిస్తున్న తీరు దళిత సామాజిక వర్గానికి బలమైన భరోసా కల్పిస్తుందని ఆమె తెలిపారు.
కూటమి ప్రభుత్వం సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందని, బాధితుడు ఏ వర్గానికి చెందిన వారైనా చట్టం ముందు అందరూ సమానమే అన్న సూత్రంతో ముందుకు సాగుతోందని ఈ చర్యలు నిరూపిస్తున్నాయని ఆమె కొనియాడారు. ప్రజల ప్రాణాలు, హక్కులు, గౌరవం విషయంలో కూటమి ప్రభుత్వం రాజీ పడే ప్రసక్తే లేదని మరోసారి చాటిచెప్పింది అని ఆమె ఉద్ఘటించారు. పేరుపోగు క్రాంతి మరణం పై పూర్తి స్థాయి విచారణ జరిపి కుటుంబం కి న్యాయం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది అని దళిత చట్టలను కఠినంగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటుంది అని ఇతర అంశాలపై కూడ దర్యాప్తు కొనసాగుతున్నట్లు ఆమె తెలిపారు. ఈ ఘటనపై బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం జరిగే వరకు ప్రభుత్వం అండగా ఉంటుంది అని ఆమె తెలిపారు.

# దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటాం - ఎమ్మెల్యే బీ.వీ

మ్మిగనూరు ,(కింగ్ )



దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి, పీఏసీ సభ్యులు డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఎమ్మిగనూరు మున్సిపల్ కార్యాలయంలో దేవాదాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలయాల అభివృద్ధి, ధూప దీప నైవేద్య పథకం అమలు, శ్రీవాణి ట్రస్ట్ ద్వారా నిధుల మంజూరు తదితర అంశాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా నందవరం మండలం గురజాల గ్రామంలోని స్వయంభు శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధిపై ప్రత్యేకంగా సమీక్షించారు. ఆలయానికి ప్రాకారం, గుడి గోపురాలు, గాలిగోపురం, ధ్వజస్తంభం తదితర నిర్మాణాల ఏర్పాటుపై చర్చిస్తూ, శ్రీవాణి ట్రస్ట్ ద్వారా నిధులు మంజూరు చేసి దేవాలయాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ధూప దీప నైవేద్య పథకంతో పాటు, శ్రీవాణి ట్రస్ట్ ద్వారా ఐదు సెంట్ల స్థలం కలిగిన ఆలయాలకు రూ.5 లక్షలు, పది సెంట్ల స్థలం ఉన్న ఆలయాలకు రూ.15 లక్షలు, ఇరవై సెంట్ల స్థలం ఉన్న ఆలయాలకు రూ.30 లక్షల వరకు నిధులు మంజూరు చేసే అవకాశం ఉందని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ఎమ్మిగనూరు పట్టణంలోని దాదాపు 400 నుంచి 500 సంవత్సరాల చరిత్ర కలిగిన పురాతన ఆలయాలైన పాత ఆంజనేయ స్వామి దేవాలయం, కోతుల బావి ఆంజనేయ స్వామి దేవాలయం, శ్రీ రామాంజనేయ స్వామి దేవాలయం, ఎదురు బసవన్న గుడి, శ్రీ నీలకంఠేశ్వర స్వామి దేవాలయాలను సందర్శించారు. ఆయా ఆలయాలకు అవసరమైన ప్రాకారాలు, గాలిగోపురాలు, ధ్వజస్తంభాల నిర్మాణం తదితర అభివృద్ధి పనులపై దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, భక్తుల సౌకర్యార్థం అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం స్వామివార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, డీఈ, సంబంధిత ఆలయాల అధికారులు, సిబ్బంది, మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారి, విశ్వహిందూ పరిషత్ సభ్యులు, బీజేపీ, జనసేన, తెలుగుదేశం పార్టీ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అప్పుడప్పుడు తలెత్తే ఆందోళనలకు మించి దీర్ఘకాలిక విలువ, ప్రయోజనాలు అందిస్తున్న జీవిత బీమా



విజయవాడ ,(కింగ్ )

......జీవిత బీమాపై మరింత సమతుల్య అవగాహన అవసరాన్ని జీవిత బీమా పరిశ్రమ నొక్కి చెబుతోంది. ఆర్థిక రక్షణ, భద్రత, క్రమబద్ధమైన పొదుపు వంటి దాని దీర్ఘకాలిక ప్రయోజనాలు, తప్పుడు అమ్మకాల వంటి ఆందోళనల కంటే చాలా ఎక్కువని స్పష్టం చేస్తోంది. వినియోగదారులు, భాగస్వాములు జీవిత బీమాను కేవలం తక్షణ లేదా స్వల్పకాలిక ఫలితాల కోసం అంచనా వేయకుండా, దానిని ఒక దీర్ఘకాలిక ఆర్థిక రక్షణ సాధనంగా చూసేలా ఇన్సూరెన్స్ అవేర్‌నెస్ కమిటీ ▪ లైఫ్ ఇన్సూరెన్స్ (×ూజ-లైఫ్) ప్రోత్సహిస్తోంది. "ఆర్థిక భద్రత, కుటుంబాలకు రక్షణ, క్రమబద్ధమైన పొదుపు ద్వారా కాలక్రమేణా విలువను అందించేందుకు జీవిత బీమా రూపొందించబడింది. తప్పుడు అమ్మకాల వంటి ఆందోళనలను పరిశ్రమ పరిష్కరించాల్సి ఉన్నప్పటికీ, అవి మొత్తం వ్యవస్థలో ఒక చిన్న భాగం మాత్రమే. ఈ వ్యవస్థ లక్షలాది పాలసీదారులకు గణనీయమైన విలువ అందిస్తూనే ఉంది," అని ఇన్సూరెన్స్ అవేర్‌నెస్ కమిటీ (×ూజ-ూఱటవ) ఛైర్‌పర్సన్ కమలేష్ రావు అన్నారు. జీవిత బీమా అనేది 'ఫ్రీ-లుక్ పీరియడ్' అందించే ఏకైక ఆర్థిక సాధనం. దీనిని కొనుగోలు చేసిన తర్వాత తమ పాలసీని సమీక్షించుకోవడానికి, అది తమ అవసరాలను తీర్చదని భావిస్తే నిర్దేశిత కాలపరిమితిలోగా దానిని వాపసు ఇచ్చే వెసులుబాటు ఇది పాలసీదారులకు కల్పిస్తుంది. కొనుగోలు సమయంలో అదనపు పారదర్శకత, వినియోగదారుల రక్షణను ఈ ఫీచర్ అందిస్తుంది.దీర్ఘకాలం పాటు పాలసీ కలిగి ఉండేలా ప్రోత్సహిస్తూ వాటి ఫలితాలు ఈ జీవితచక్రంతో దగ్గరగా ముడిపడి ఉండేలా జీవిత బీమా ఉత్పత్తులు రూపొందించబడి ఉంటాయి. ముందస్తుగా ఈ పాలసీలను మదింపు చేసినప్పుడు ఈ ప్రయోజనాల పూర్తి స్థాయి వెంటనే స్పష్టంగా కనిపించకపోవచ్చు. "దీర్ఘకాలిక ఆర్థిక పరిష్కారాలను స్వల్పకాలిక దృష్టితో అంచనా వేయడం వల్ల వాటి మొత్తం విలువ అసంపూర్ణ నిర్ధారణలకు దారితీయవచ్చు," అని శ్రీ రావు తెలిపారు.జీవితంలో కీలకమైన సంఘటనల సమయంలో ఆర్థిక రక్షణ కల్పించడమే జీవిత బీమా ప్రధాన ఉద్దేశం. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఈ పరిశ్రమ మరణ ప్రయోజనాలు, మెచ్యూరిటీలు, యాన్యుటీలు, విత్‌డ్రాయల్స్ సహా క్లెయిమ్‌ల రూపంలో 6.3 లక్షల కోట్లకు పైగా చెల్లించి లక్షలాది కుటుంబాలకు కీలకమైన ఆర్థిక సాయాన్ని అందించింది.

# వాహన తనిఖీలు

## -సుమారు 30 కిలోల ఎలక్ట్రికల్ వైర్ కాయిల్స్ అక్రమ తరలింపు

## స్వాధీనం చేసుకున్న పోలీసు సిబ్బంది

నాతవరం ,(కింగ్ )



గన్నవరం మెట్ట వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో, నాతవరం మండలంలోని వీబీ అగ్రహారం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు పాత సిల్వర్ స్క్రాప్ వస్తువుల కొనుగోలు పేరుతో సుమారు 30 కిలోల ఎలక్ట్రికల్ వైర్ కాయిల్స్‌ను అక్రమంగా తమ వద్ద నిల్వ ఉంచుకుని విక్రయించేందుకు తుని తరలిస్తుండగా వాహన తనిఖీలలో పట్టుబడినారు. దొంగిలించిన ఆస్తిని అక్రమంగా కలిగి ఉండటం మరియు విక్రయించేందుకు తరలించడం నేరంగా పరిగణించి, సంబంధిత వస్తువులను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేయడమైనది. ఈ సందర్భంగా మండల ప్రజలందరికీ పోలీసు శాఖ విజ్ఞప్తి చేస్తున్నది ఏమనగా, దొంగిలించిన వస్తువులను కొనుగోలు చేయడం, విక్రయించడం లేదా తమ వద్ద ఉంచుకోవడం చట్టరీత్యా నేరం. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించవలసిందిగా కోరుతున్నాము. ముఖ్యంగా ఎలక్ట్రికల్ మోటార్లు, ఎలక్ట్రికల్ వైర్లు, దేవాలయాలు మరియు ఇతర ప్రజా ప్రదేశాల వద్ద అనుమానిత వ్యక్తులు సంచరిస్తున్నట్లు గమనించినట్లయితే పోలీసులకు వెంటనే తెలియజేయాలి. ప్రజల సహకారంతో ఇటువంటి నేరాలను సమర్థవంతంగా నివారించవచ్చని కోరడమైనది.

# స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" లో భాగంగా 52వ వార్డు అంబేద్కర్ కాలనీ అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించిన ప్రభుత్వ విప్ గణబాబు

విశాఖపట్నం,(కింగ్ )



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు, పరిశుభ్రత, పారిశుధ్యం మరియు పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న "స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర" (ూూూూ) క్షేత్రస్థాయి కార్యాచరణలో భాగంగా ఈరోజు పశ్చిమ నియోజకవర్గం 52వ వార్డు పరిధిలోని అంబేద్కర్ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శాసనసభ్యులు ప్రభుత్వ విప్ గణబాబు, అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి పలు పారిశుధ్య సేవా కార్యక్రమాల్లో స్వయంగా పాల్గొన్నారు.

కార్యక్రమ ముఖ్యాంశాలు:

అంగన్వాడీ కేంద్రానికి విచ్చేసిన ఎమ్మెల్యే గణబాబు కి పార్టీ శ్రేణులు, స్థానిక మున్సిపల్ అధికారులు, పారిశుధ్య సిబ్బంది మరియు మహిళలు ఘన స్వాగతం పలికారు అనంతరం అంగన్వాడీ కేంద్రంలోని వంటగదిని, వాష్‌రూమ్‌లను ఎమ్మెల్యే గారు స్వయంగా తనిఖీ చేశారు. కేంద్రం లోపల, పరిసర ప్రాంతాలలో పారిశుధ్య నిర్వహణను మరియు పరిశుభ్రత పద్ధతులను అధికారులతో కలిసి సమీక్షించారు. చిన్నారులతో ముచ్చట్లు: అంగన్వాడీ పిల్లలతో ఆప్యాయంగా మాట్లాడి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నిత్య జీవితంలో పరిశుభ్రత, ఆరోగ్యం మరియు మంచి అలవాట్ల యొక్క ప్రాముఖ్యతను పిల్లలకు వివరించారు.సిబ్బందితో సమీక్, స్థానిక అంగన్వాడీ, మున్సిపల్ సిబ్బందితో మాట్లాడి, పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. 'స్వచ్ఛ ఆంధ్ర' సాకారం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వారికి వివరించారు.పరిశుభ్రత ప్రతిజ్ఞ సామాజిక బాధ్యతను పెంపొందించేలా అక్కడ ఉన్న విద్యార్థులు, అంగన్వాడీ సిబ్బంది, స్థానిక నాయకులు మరియు అధికారులందరితో కలిసి ఎమ్మెల్యే గణబాబు 'పరిశుభ్రత ప్రతిజ్ఞ' (సా సా ప్లేడ్జి ) చేయించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ

ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు కలల ప్రాజెక్ట్ అయిన 'స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్ర' లక్ష్యాన్ని నిజం చేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. మన పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం మన సామాజిక బాధ్యత. ఆరోగ్యకరమైన, సంపన్నమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ చురుగ్గా పాల్గొనాలని కోరుతున్నాను."

ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ హేమావతి, ఏయంహెచ్ ఓ హర్ష, సీడీపీఓ నీలిమ, మాజీ కార్పొరేటర్ బొమ్మిది రమణ, స్థానిక వార్డు నాయకులు వై తిరుమల రావు, చంద్రశేఖర్, ఇతర నాయకులు, మున్సిపల్ అధికారులు, అంగన్వాడీ కార్యకర్త, పారిశుధ్య కార్మికులు, మరియు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారంలో ప్రజలకు భరోసా కల్పించాలి సింహాచలం బీఆర్టీఎస్ బాధితులకు న్యాయం: గంటా

విశాఖపట్నం ,(కింగ్ )




ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యమిస్తోందని, అందులో భాగంగానే అధికారులు పాల్గొనే వేదికలే కాకుండా ఎమ్మెల్యేలు కూడా ప్రతి వారం పీజీఆర్ఎస్ లను నిర్వహిస్తున్నట్టు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఎంవీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో శనివారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఆయన నిర్వహించారు. ప్రజల విజ్ఞాపనలపై అధికారులు తక్షణమే స్పందించాలని.. సమస్యలను పరిష్కరించడం ద్వారా ప్రజలకు ప్రభుత్వం అండగా ఉందన్న భరోసా కల్పించాలని సూచించారు. సింహాచలం బీఆర్టీఎస్ రోడ్డు నిర్మాణంలో కూల్చివేసిన ఇళ్ల పునర్నిర్మాణ ప్రయత్నాలను సింహాచలం దేవస్థానం అధికారులు అడ్డుకుంటున్న విషయాన్ని బాధితులు ఎమ్మెల్యే గంటా దృష్టికి తీసుకువచ్చారు. రోడ్డు కోసం స్థలమిచ్చి రోడ్డున పడ్డామని, మూడేళ్లుగా అద్దె ఇళ్లల్లో తల దాచుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై గంటా స్పందిస్తూ తొలగించిన కట్టడాలకు జీవీఎంసీ పరిహారాన్ని పొందిన వారు పునర్నిర్మాణం చేసుకోవచ్చని.. ఆ దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బీఆర్టీఎస్ రోడ్డులో 41 టీడీఆర్ ల సేల్ ఆప్షన్ లు వెంటనే ఇవ్వాలని, పెండింగ్ లో ఉన్న వందకు పైగా టీడీఆర్ లు త్వరితగతిన జారీ చేయాలని ఏసీపీ శాస్త్రిని ఆదేశించారు. చిన్న రుషికొండ లో తొలగించిన 50 మంది చిల్లర వర్తకులకు న్యాయం చేయాలని, ఎండాడ బంగారమ్మ అమ్మవారి ఆలయానికి వెళ్లే రహదారి సమస్య పరిష్కరించాలని ఆయా ప్రాంతవాసులు కోరారు. ఆనందపురం జట్లమ్మ కొండ వద్ద ఇళ్లు కోల్పోయిన వారికి స్థలాలు మంజూరు చేయాలని అభ్యర్థించారు. 8 వ వార్డు సన్ కాలేజీ వద్ద మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులను తక్షణమే ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. తిమ్మాపురం, మధురవాడ ప్రాంతాల్లో ఆక్రమణలు అరికట్టాలని, పేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించాలని వినతి పత్రాలను సమర్పించారు. పీజీఆర్ఎస్ లో 11 రెవిన్యూ, 4 హౌసింగ్, 4 పురపాలక శాఖ వినతులు అందాయి.

# పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

## -- డాక్టర్ కందుల నాగరాజు

విశాఖపట్నం,(కింగ్ )



పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా భావిస్తూ సహకరించాలని శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం చైర్మన్, కె.ఎన్.ఆర్.చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జనసేన నాయకులు,32వ వార్డు మాజీ కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు పిలుపునిచ్చారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని 32వ వార్డు అల్లిపురం మార్కెట్ ప్రాంతంలో ఆయన ప్రారంభించారు. స్వయంగా చీపురు పట్టి పరిసరాలను శుభ్రంచేసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమం పై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్త పారిశుధ్య విప్లవాన్ని తీసుకువచ్చిందని చెప్పారు. అందమైన నగరాలను నిర్మించాలనే లక్ష్యంతో, కూటమికి చెందిన ఎన్నికైన ప్రతినిధులు "ఆపరేషన్ క్లీన్ స్వీప్" "స్వర్ణాంధ్ర ▪ స్వచ్ఛాంధ్ర" కార్యక్రమాలను నేరుగా క్షేత్రస్థాయికి తీసుకువెళ్లి ప్రారంభించారని వెల్లడించారు. ప్రజల భాగస్వామ్యంతో మాత్రమే నిజమైన పరిశుభ్రతను సాధించగలమని చెప్పారు. నగరాల స్వచ్ఛతలో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరని పిలుపునిచ్చారు.

స్వచ్ఛతా ప్రమాణాలే ఆపరేషన్ క్లీన్ స్వీప్ లక్ష్యమని, ప్రజా జీవనంలో పరిశుభ్రతే ముఖ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమలో భాగంగా, ప్రజలలో అవగాహన కల్పించడానికి తాము కృషి చేస్తున్నామని, మన పరిసరాలు పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉండాలంటే కేవలం ప్రభుత్వ ప్రయత్నాలు మాత్రమే కాకుండా ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఎస్.ఐ. కీర్తి, వార్డు సెక్రెటరీలు,మేస్త్రీ, సూపర్వైజర్, ఫిష్,వెజిటబుల్ మార్కెట్ వ్యాపారులు, ఎస్.హెచ్.జి.సభ్యులు పాల్గొన్నారు.

# సాగర్ నగర్ బీచ్ లో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర

విశాఖపట్నం ,(కింగ్ )






పరిసరాల శుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యమివ్వాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛంద్రలో భాగంగా శనివారం సాగర్ నగర్ బీచ్ క్లీన్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు వేలాది మంది పర్యాటకులు వచ్చే బీచ్ ను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రజలతో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అధికారులు, కూటమి శ్రేణులతో పాటు మనవడు విఖ్యాత్ తో కలిసి బీచ్ లో చెత్త తొలగించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, శాఖారి శ్రీనివాస్, చెట్టుపల్లి సన్యాసిరావు, లొడగల అప్పారావు, చెట్టుపల్లి గోపీ, మంగాదేవి, నాగోతి సత్యనారాయణ, కానూరు అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యం...

## ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ


గోకవరం ,(కింగ్ )




గోకవరం మండల పరిషత్ కార్యాలయంలో 2026-27 లో మొదటి విడత అన్నదాత సుఖీభవ మరియు పి యమ్ కిసాన్ నగదు జమ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మెంబర్, జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆహార ధాన్యల స్టాలు ఎమ్మెల్యే పరిశీలించారు. ఆయన చేతుల మీదుగా రైతులకు అన్నదాత సుఖీ భవ పీఎం కిసాన్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి ఎన్నో కార్యక్రమాలు శ్రీకారం చుట్టిందని, గత ప్రభుత్వంలో రైతును నట్టేట ముంచిందని రైతులు సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యం అని ఎమ్మెల్యే నెహ్రూ అన్నారు. ప్రతి ఒక్కరు యూరియా వాడకం తగ్గించాలని సేంద్రియ ఎరువులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన రైతులకు సూచించారు. మండలంలో అన్నదాత సుఖీభవ మరియు పి యమ్ కిసాన్ పథకంలో 7742 మంది రైతులకు 4.80కోట్ల రూపాయలు రైతుల బ్యాంకు ఖాతాలో జమ అయినవని, ప్రతి రైతుకి 7000 రూపాయలు ఇవ్వడం జరిగిందనన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా నాలుగు మండలాల్లో 30557 మంది రైతులకు అన్నదాత సుఖీభవ రూ.15.28 కోట్లు, పిఎం కిసాన్ రూ.5.07 కోట్లు, రూపాయలు అందించినట్లు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సైబర్. మహిళల భద్రత. ఆర్థిక భద్రత పై అవగాహన కల్పించిన పట్టణ సీఐ.

సాలూరు,(కింగ్ )






సాలూరు టౌన్ పరిధిలో గ్రామీణకూట్ క్రెడిట్ యాక్సెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళలకు సైబర్ భద్రత, మహిళల భద్రత మరియు ఆర్థిక మోసాలపై పట్టణ సీఐ. బి. అప్పలనాయుడు అవగాహన కల్పించడం అయింది. ఈ సందర్భంగా సైబర్ మోసాలు, నకిలీ మొబైల్ యాప్‌లు (ఫేక్ యాప్స్) , డిజిటల్ లోన్స్, మైక్రో ఫైనాన్స్ మోసాలు, డిజిటల్ అరెస్ట్ పేరుతో జరుగుతున్న మోసాలు, యూపిఐ. మరియు ఓటీపీ మోసాల గురించి వివరించారు. ఓటీపీ. యూపిఐ.పిన్ సీవీవీ. బ్యాంకు ఖాతా వివరాలు మరియు పాస్‌వర్డ్‌లను ఎవరికీ తెలియజేయరాదని, అనుమానాస్పద లింకులు మరియు ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే మహిళల భద్రతకు సంబంధించి ఒంటరిగా ప్రయాణించే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, అత్యవసర పరిస్థితుల్లో డయల్-112 మరియు సైబర్ మోసాల ఫిర్యాదుల కోసం 1930 హెల్ప్‌లైన్‌ను వినియోగించుకోవాలని అవగాహన కల్పించారు. ప్రజలు సైబర్ నేరాలు, ఆర్థిక మోసాల పట్ల అప్రమత్తంగా ఉండి సురక్షితమైన డిజిటల్ లావాదేవీలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణకూట్ క్రెడిట్ యాక్సెస్ సిబ్బంది, మహిళలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ కుమార్తెకు అండగా నిలిచిన ఏలేశ్వరం పబ్లిక్ స్కూల్

ఏలేశ్వరం,(కింగ్ )




స్థానిక ఏలేశ్వరం పబ్లిక్ స్కూల్‌లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థిని సుంకర జాహ్నవికి పాఠశాల యాజమాన్యం శనివారం టీసీ, ఇతర విద్యా ధ్రువపత్రాలను అందజేసింది. ఇటీవల ప్రకటించిన పదో తరగతి ఫలితాల్లో జాహ్నవి 534 మార్కులు సాధించింది.మూడేళ్ల క్రితం గుండెపోటుతో మృతి చెందిన ఆంధ్రజ్యోతి విలేఖరి సుంకర సత్యనారాయణ కుమార్తె అయిన జాహ్నవికి ఎనిమిదో తరగతి నుంచి పదో తరగతి వరకు పూర్తిగా ఉచిత విద్యను అందించిన ఏలేశ్వరం పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ దాసరి వీర వెంకట సత్యనారాయణ (డి.వి. సత్యనారాయణ) మీడియా మిత్రుల సమక్షంలో ధ్రువపత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా డి.వి. సత్యనారాయణ మాట్లాడుతూ, సుంకర సత్యనారాయణ తనకు ఆత్మీయ మిత్రుడని, ఆయన అకాల మరణం ఎంతో బాధ కలిగించిందని పేర్కొన్నారు. జాహ్నవి కష్టపడి చదివి జీవితంలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.జర్నలిస్టు ఎం.డి. అధికార్ మాట్లాడుతూ, జర్నలిస్టుల కుటుంబాలు ఎదుర్కొనే ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని జాహ్నవికి మూడు సంవత్సరాల పాటు ఉచిత విద్యతో పాటు పరీక్షలకు ప్రత్యేక శిక్షణ అందించి మంచి ఫలితాలు సాధించేలా సహకరించిన ఏలేశ్వరం పబ్లిక్ స్కూల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ స్రవంతి, బి.ఏ. కృష్ణ, ప్రధానోపాధ్యాయుడు పి.వి. శంకరాచార్యులు, జర్నలిస్టులు కోరాడ శ్రీనివాసరావు, దాసరి కృష్ణ, మువ్వల శ్రీనివాస్, దొంతశీశెట్టి సతీష్, ఎస్. మల్లికార్జునరావు, పారేపల్లి గంగా ప్రసాద్, కొల్లేపర దుర్గాశ్రీనివాస్, పోతుల లోవరాజ్, షేక్ ఇమ్రాన్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# గొలుగొండ పర్యటనలో జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణ

## యోగ - ప్రత్యేక పారిశుధ్యం-ఓటర్ సర్వే పరిశీలన

గొలుగొండ అనకాపల్లి జిల్లా ,(కింగ్ )





అనకాపల్లి జిల్లా కృష్ణా దేవి పేట అల్లూరి సీతారామరాజు ఉద్యానవనములో శనివారం 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణ తోపాటు నాలుగు మండలాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు. జనసేన నాయకుడు సూర్యచంద్ర కూటమి నాయకులు పాల్గొన్నారు. యోగ ప్రతి ఒక్కరి దినచర్యలో భాగం. కావాలని. శారీరక మానసిక ఆరోగ్యానికి యోగ ఎంతో ఉపయోగపడుతుందని. కలెక్టర్ పేర్కొన్నారు. ఆయుష్మాన్ భారత్. అధికారుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 500 మంది యోగా సాధనలో పాల్గొన్నారు అనంతరం ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్న వారికి రాగిసంకటి జావా అందజేశారు. అనంతరం కలెక్టర్ గొలుగొండ గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో పాల్గొని గ్రామంలో ప్రధాన వీధులు కాలువలు పరిసర ప్రాంతాలను పరిశీలించారు పరిశుభ్రత కార్యక్రమాల్లో స్వయంగా పాల్గొన్న ఆయన గ్రామంలో పారిశుధ్యాన్ని నిరంతరం కొనసాగించాలని. చెత్త నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని. అధికారులకు సూచించారు. ప్రజలు కూడా పరిశుభ్రమైన గ్రామ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు తదుపరి కొత్త మల్లంపేట గ్రామంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ సర్వేను కలెక్టర్ పరిశీలించి సర్వే ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఎంపీడీవో శ్రీనివాసరావు గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# పేకాట ఆడుతున్న 6 గురు వ్యక్తుల వద్ద 6320. రూపాయలు స్వాధీనం. ఎస్సై అర్జున్.


సాలూరు.,(కింగ్ )




పాచిపెంట గ్రామ పొలిమేరలో పేకాట ఆడుతున్న వారిపై పోలీస్ సిబ్బందితో రైడ్ చేయడం జరిగింది. పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులును అందులోకి తీసుకొని వారి వద్ద నుండి 6320 రూపాయలు స్వాధీనం చేసుకోవడం అయిందని. గ్రామాల్లో కానీ, గ్రామ పొలిమేరలో కానీ అసంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చట్టమైన చర్యలు తీసుకుంటాము అని. పోలీసులకు సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచబడునని ఎస్సై ఎల్. అర్జున్ పత్రికా ముఖ్యంగా తెలియజేసారు.

# సర్ పై ఓటర్లకు అవగాహన కార్యక్రమం

ఆలమూరు ,(కింగ్ )



సర్ కార్యక్రమంలో పాల్గొని ఓటర్లకు ఈ కార్యక్రమం పై అవగాహన కల్పించిన కొత్తపేట నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ టి ఎన్ టి యూ సి అధ్యక్షులు తాడి శ్రీనివాస్ రెడ్డి ఈ సందర్భంగా తాడి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరు ఈ సర్వేకు వస్తున్న అధికారులకు సహకరించాలని కోరారు ఈ కార్యక్రమంలో జొన్నడ గ్రామ తెలుగు యువత అధ్యక్షుడు వీరి సందీప్ మరియు గ్రామ యువ నాయకుడు నానవరపు నాగరాజు పాల్గొనడం జరిగింది

# ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన. అధికారులు.

సాలూరు.,(కింగ్ )




పాచిపెంట మండలంలో గల విత్తన మరియు ఎరువుల దుకాణాలను వ్యవసాయ సహాయ సంచాలకులు మరియు మండల వ్యవసాయ అధికారి వారు తనకి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు ఏడీఏ కామరాజు మామ స్టోర్స్ మరియు రైతు డిపాట్ షాపులను తనిఖీ చేస్తూ అధిక ధరలకు విత్తనాలను అమ్మకూడదు అదే విధంగా ప్రతి రైతుకు బిల్లు కచ్చితంగా ఇవ్వాలని తెలిపారు. ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తూ ఈ సీజన్ కి సంబంధించి ఎరువులను ఏపీ ఏఐఎంఎస్ 2.0 యాప్ ద్వారా మాత్రమే సరఫరా చేయాలని తెలిపారు. ప్రతి రైతు ఆధార్ తప్పనిసరిగా ఎరువుల కొనుగోలుకు తీసుకొని రావాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి అనురాధ పండ మాట్లాడుతూ ఎరువులను మరియు విత్తనాల దుకాణాల్లో ధరల పట్టిక కచ్చితంగా ఉండాలని ఆమె తెలిపారు.

# ప్రజలకు పాలన చేరువ కావడానికే ప్రజా దర్బార్...

## కొత్తపేట మండలం అవిడి ప్రజాదర్బార్ లో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు...

కొత్తపేట,(కింగ్ )



ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వేగవంతంగా పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. శనివారం కొత్తపేట మండలం అవిడి సచివాలయం వద్ద ఆయన ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజా దర్బార్ వంటి కార్యక్రమాల ద్వారా ప్రజల వద్దకే పరిపాలన చేరుతుందన్నారు. ప్రజల అవసరాలు, సమస్యలు, అభ్యర్థనలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలంటే ప్రజలతో ప్రత్యక్ష సంబంధం అవసరమని, అందుకే తరచూ ప్రజల మధ్యకు వచ్చి ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మొత్తం 18 వినతులు అందగా పలు సమస్యలను అక్కడికక్కడే ఎమ్మెల్యే పరిష్కరించారు.

## మన దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 12 సంవత్సరాల పరిపాలన మీద ఎగ్జిబిషన్ లో పాల్గొన్న విద్యార్థులకు వివరాలను తెలియజేసిన జిల్లా బిజెపి అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు.

శ్రీకాకుళం ,(కింగ్ )

గౌరవనీయులైన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశానికి 12 ఏళ్ల పాటు అంకితభావంతో కూడిన సేవలను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా, బీజేవైఎం శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధన్నాన మదన్ మోహన్ గారి ఆధ్వర్యంలో శ్రీకాకుళం ఆర్.టి.సి కాంప్లెక్స్ ఆవరణలో (ఎగ్జిబిషన్) ఏర్పాటు చేశారు.ఈ ప్రదర్శనను శ్రీకాకుళం జిల్లా బీజేపీ అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు ముఖ్య అతిధిగా హాజరై, ప్రారంభించారు ఈ కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షులు ఎగ్జిభిషన్లో పాల్గొన్న విద్యార్థులకు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు, అమరావతి రాజధాని అభివృద్ధి, విశాఖపట్నం రైల్వే జోన్ వంటి కీలక ప్రాజెక్టులతో పాటు ఉత్తరాంధ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని తెలిపారు. శ్రీకాకుళం జిల్లాకు మూలపేట పోర్టు, పలాస విమానాశ్రయం ప్రతిపాదన, తీర ప్రాంత కారిడార్ అభివృద్ధి, అరుదైన ఖనిజాల వెలికితీతకు కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇవ్వడం వంటి కార్యక్రమాలు జిల్లాలో ఉపాధి అవకాశాలను పెంచనున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో 193 కిలోమీటర్ల తీర ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం ద్వారా వలసలను తగ్గించి స్వయం సమృద్ధి సాధించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయన్నారు . అంత్యోదయ సిద్ధాంతానికి అనుగుణంగా సమాజంలోని చివరి వ్యక్తికి కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా మోదీ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. జల్ జీవన్ మిషన్ వంటి పథకాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దేశంలో డిజిటల్ లావాదేవీల విస్తరణకు మోదీ ప్రభుత్వం చేపట్టిన డిజిటలైజేషన్ కార్యక్రమాలు



కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు. ఒకప్పుడు విమర్శలు ఎదుర్కొన్న డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ నేడు ప్రపంచంలోనే అత్యధికంగా వినియోగిస్తున్న దేశంగా భారత్‌ను నిలిపిందన్నారు. చిన్న వ్యాపారుల నుంచి సామాన్య ప్రజల వరకు ఫోన్‌పే, యూపీఐ, క్యూ ఆర్ కోడ్‌ల ద్వారా లావాదేవీలు నిర్వహిస్తున్నారని తెలిపారు.

భారతదేశాన్ని 2047 నాటికి ప్రపంచంలో అగ్రస్థానంలో నిలిపే లక్ష్యంతో మోదీ ప్రభుత్వం అమృతకాల దిశగా పనిచేస్తోందని, దేశాన్ని శక్తివంతమైన, స్వయం సమృద్ధి కలిగిన దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ ప్రదర్శనను విద్యార్థులు, యువత, ప్రయాణికులు పెద్ద సంఖ్యలో సందర్శించి కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన పొందాలని కోరారు.ఈ కార్యక్రమం లో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అట్టాడ రవిబాబ్జి ,పూర్వ నేషనల్ కౌన్సిల్ మెంబెర్ చల్లా వెంకటేశ్వరరావు , పాతపట్నం నియోజకవర్గ బి.ఎల్ ఏ.1 సిరిపురం త్రివేణి ,మహిళ మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ పైడి సింధూర ,శ్రీకాకుళం ఈస్ట్ మండల అధ్యక్షురాలు కనుగుల లలితకుమారి , యువమోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి బోర గోపి, మోర్చా నాయకులు శేషగిరి, నారాయణరావు, సంతోష్,యువమోర్చ లీగల్ సెల్ కన్వినర్ సూర్య, మోర్చా నాయకులు,కార్యకర్తలు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గున్నారు.

## నేటి నుంచి బంధవీధి వెన్నెలమ్మ తల్లి జాతర

### మూడు రోజుల పాటు కనులపండువగా ప్రత్యేక పూజలు

**భక్తుల కోసం ఏర్పాట్లు పూర్తి**

జి.మాడుగుల ,(కింగ్ )

జి.మాడుగుల మండలంలోని కె.కోడాపల్లి పంచాయతీ బంధవీధి గ్రామంలో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. గ్రామదేవత శ్రీ వెన్నెలమ్మ తల్లి జాతర మహోత్సవాలు ఆది, సోమ, మంగళవారాల్లో అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఈ మూడు రోజుల పాటు అమ్మవారికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, పలు భక్తిరస కార్యక్రమాలను నిర్వహించనున్నారు.



ఈ ఉత్సవాలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉందని జాతర కమిటీ సభ్యులు వెల్లడించారు. వచ్చే భక్తులకు ఎక్కడా, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామస్తుల పూర్తి సహకారంతో అన్ని మౌలిక వసతులను కల్పించినట్లు వివరించారు.జాతరను ఘనంగా విజయవంతం చేసేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ ఏర్పాట్లలో కమిటీ ప్రతినిధులు పలాసీ సింహాచలం, పలాసీ పెంటయ్య, మాతే వెంకటరమణ, దలాయి రాజు, సోమలి సూరిబాబు, పలసీ కొండబాబుతో పాటు స్థానిక గ్రామస్తులు చురుగ్గా పాల్గొన్నారు.

## ప్రమాదంలో మరణించిన కార్యకర్తకు 85వ వార్డులో 5 లక్షల ప్రమాద బీమా అందించిన రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం,(కింగ్ )

అధికారంలో ఉన్న ప్రతిపక్షంలో ఉన్న నిరంతరము ప్రజల ప్రక్షాన పోరాడుతున్న తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు ప్రమాదవశాత్తు మరణిస్తే వారికి 5 లక్షల రూపాయల బీమాను తెలుగుదేశం పార్టీ అందజేస్తున్నదని పల్లా శ్రీనివాసరావు, అన్నారు. 85వ వార్డులో ప్రమాదవశాత్తు మరణించిన పినమడక గ్రామానికి చెందినటువంటి తెలుగుదేశం పార్టీ కార్యకర్త ఉరుకూటి బోయన్న గారి



సతీమణి కనకమహాలక్ష్మికి 85 వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కర్రి దశేంద్ర గారి ఆధ్వర్యంలో ఈరోజు 5 లక్షల రూపాయలు బీమా చెక్కును అందజేశారు. దేశంలోనే కార్యకర్తలకు ప్రత్యేకమైన నిధులు ఏర్పాటు చేసిన ఘనత జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు గారికి జాతి వర్కింగ్ ప్రెసిడెంట్ రాష్ట్ర మంత్రివర్యులు లోకేష్ బాబు గారికే చేందుతుందని పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ గాజువాక సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావు , వార్డు ప్రధాన కార్యదర్శి విందుల రాజు, హాస్పిటల్ డైరెక్టర్ డొక్కా రమేష్ , కమాండ్ గొల్లవిల్లి నూకరాజు, బంధం ధనాబాబు, యలమంచిలి శ్రీను, కొయ్య సింహాద్రి, ముచ్చు దయాకర్, అలమండ శ్రీను, ఛట్టి సోమి కుమారి,వార్డ్ మహిళా అధ్యక్షురాలు గీతా అన్నపూర్ణ, వార్డ్ ఐ టి డి పి జనరల్ సెక్రటరీ గోపిశెట్టి పద్మ, నియోజకవర్గ ఐటీడీపీ జనరల్ సెక్రటరీ జామీ స్వాతి తదితరులు పాల్గొన్నారు. లిస్టీల్ ప్లాంట్ ఎస్ఎంఎస్-1 లో జరిగినటువంటి ప్రమాదంలో మరణించిన డొంకాడ గ్రామానికి చెందినటువంటి నక్కరాజు అప్పలరాజు గారి దిన కార్యములో పాల్గొని ఘన నివాళులర్పించి ప్రగాఢమైన సానుభూతి సంతాపాన్ని తెలియజేసి ఆ కుటుంబానికి ధైర్యం చెప్పిన రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పల్లా శ్రీనివాసరావు . ఈ సందర్భంగా మాట్లాడుతూ అతి త్వరలోనే స్టీల్ ప్లాంట్ యాజమాన్యంతో ప్రభుత్వంతో మాట్లాడి మరణించిన కుటుంబాలకు రావలసినవన్నీ కూడా వెంటనే పూర్తి చేస్తామని భరోసా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ గాజువాక సమన్వయకర్త ప్రసాదల శ్రీనివాసరావు , 79 వ వార్డు మాజీ కార్పొరేటర్ రావు శ్రీనివాస్ గారు, 85వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కర్రి దశేంద్రలిజనసేన అధ్యక్షులు గవర సోమశేఖర్, వార్డు ప్రధాన కార్యదర్శి విందుల రాజు, హాస్పిటల్ డైరెక్టర్ డొక్కా రమేష్ గారు,కమాండో గొల్లవిల్లి నూకరాజు, దాసరి డాన్ శ్రీను, యల్లపు సాంబశివరావు, బంధం ధనాబాబు, అలమండ శ్రీను, గీతా అన్నపూర్ణ ,పద్మ, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## నువా' న్యాచురల్ డైమండ్ ఆభరణాల కలెక్షన్ ను ప్రారంభించిన పల్లా లావణ్య దేవి

విశాఖపట్నం ,(కింగ్ )

ప్రకృతి స్ఫూర్తితో రూపుదిద్దుకున్న న్యాచురల్ డైమండ్ ఆభరణాల ప్రత్యేక కలెక్షన్ 'నువా' ను శనివారం సాయంత్రం విశాఖపట్నంలోని వీఐపీ రోడ్‌లో ఉన్న మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్‌లో ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సతీమణి, ఆంధ్ర విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పల్లా లావణ్య దేవి హాజరై కలెక్షన్‌ను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రకృతి అందాలు, నిగూఢమైన భావోద్వేగాలు,




ఆధునిక మహిళ అభిరుచులను ప్రతిబింబించేలా రూపొందించిన 'నువా' కలెక్షన్ విశేషంగా ఆకట్టుకుంటోందని పేర్కొన్నారు. ఈ నూతన కలెక్షన్ లో వాడే ప్రతి ఆభరణానికి సర్టిఫికేషన్ అందించడం జరుగుతుందని ఆమె తెలిపారు. అనంతరం మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ కోస్టల్ ఆంధ్ర జోనల్ హెడ్ ఫెబిన్ మాట్లాడుతూ, ఈ కలెక్షన్‌లోని ప్రతి ఆభరణం ప్రకృతిలో కనిపించే పువ్వులు, ఆకులు, నక్షత్రాలు, నదీ ప్రవాహాలు వంటి సహజ అంశాల స్ఫూర్తితో రూపొందించబడిందని తెలిపారు. నేటి మహిళ వ్యక్తిత్వం, ఆత్మవిశ్వాసం, సొగసును ప్రతిబింబించే విధంగా ప్రత్యేక డిజైన్లతో ఈ ఆభరణాలను తయారు చేసినట్లు వివరించారు. తమకు వచ్చే లాభాల్లో ఐదు శాతం విధులను సిఎస్ఆర్ కార్యక్రమానికి వినియోగిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది, వినియోగదారులు మరియు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మాడగడ వ్యూ పాయింట్ వద్ద ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

ఏ ఎస్ ఆర్ జిల్లా పాడేరు అరకువాలీ, ,(కింగ్ )

అల్లూరి జిల్లా, అరకు లోయ మండలం పరిధిలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన మాడుగడ వ్యూ పాయింట్ వద్ద యోగా కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించబడింది. ప్రకృతి ఒడిలో, ఆహ్లాదకరమైన వాతావరణం మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లాకలెక్టర్నిషాంతి. టి, జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ, ఐటిటి ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ,జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద లతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి యోగ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి, పాడేరు మాజీ శాసనసభ్యులుగిడ్డి ఈశ్వరి , వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హాజరై ఉత్సాహంగా యోగాసనాలు వేశారు.

మానసిక ప్రశాంతతకు, శారీరక దృఢత్వానికి యోగా ఎంతగానో దోహదపడుతుందని, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను ఒక భాగం చేసుకోవాలని ఈ సందర్భంగా అధికారులు పిలుపునిచ్చారు. సరిహద్దు ప్రాంతాల్లో సైతం యోగా పట్ల అవగాహన కల్పించేందుకు, పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు మాడగడ వ్యూ పాయింట్‌ను ఈ వేడుకకు వేదికగా ఎంపిక చేయడం గొప్ప విశేషం. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఘనంగా యోగా దినోత్సవ వేడుకలు యోగాను నిత్య జీవితంలో బాగం చేసుకోవాలని పిలుపునిస్తూ, భారతీయ సంస్కృతి అందించిన అమూల్యమైన వరం యోగా అని, దీనిని కేవలం ఒక రోజు కార్యక్రమంగా కాకుండా ప్రతి ఒక్కరూ తమ నిత్య జీవితంలో ఒక అలవాటుగా మార్చుకోవాలని అల్లూరి జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. ఆరోగ్యకరమైన జీవనశైలికి మార్గం, యోగా అనేది కేవలం ఒక శారీరక వ్యాయామం మాత్రమే కాదు. ఇది శారీరక ఆరోగ్యంతో పాటు, మానసిక ప్రశాంతతను మరియు ఉత్తమ జీవనశైలిని ప్రసాదించే ఒక అద్భుత మార్గమని పేర్కొన్నారు. మానసిక ఒత్తిడికి పరిష్కారం, ప్రస్తుత కాలంలో మారుతున్న జీవనశైలి వల్ల తలెత్తుతున్న తీవ్ర ఒత్తిడి, ఆందోళన ఇతర అనారోగ్య సమస్యలకు యోగా చక్కటి పరిష్కారం చూపుతుందని,ప్రతిరోజూ కొన్ని నిమిషాల పాటు యోగా సాధన చేయడం ద్వారా మానసిక స్థైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని, సంపూర్ణ ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చునని తెలిపారు.

ప్రకృతి ఒడిలో యోగా, ప్రకృతి సంపదకు నిలయమైన అల్లూరి జిల్లాలో ప్రకృతి, యోగా కలయికతో ప్రజలు సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించవచ్చని ఆకాంక్షించారు. ఈ యోగ కార్యక్రమంలో యువత, విద్యార్థుల పాత్రే కీలక మని దేశ ప్రగతికి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యువతే ప్రధాన బలం. కాబట్టి విద్యార్థులు, యువత యోగా పట్ల ప్రత్యేక ఆసక్తిని



పెంపొందించుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

ఈ యోగా కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేసినప్రజా ప్రతినిధులకు జిల్లా ప్రజలకు, విద్యార్థులకు, అధికారులకు, సమన్వయకర్తలకు నిర్వాహకులు కలెక్టర్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ యోగ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ, ఐటిడి ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ, పాడేరు మాజీ శాసనసభ్యురాలు గిడ్డీ ఈశ్వరి, ట్రైకర్ డైరెక్టర్ కె కృష్ణారావు, జీసీసీ డైరెక్టర్ బొర్ర నాగరాజు ఇతర ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నూనెపల్లిలో అంగన్వాడీలు,పాఠశాలల తనిఖీ.

విద్యార్థుల భోజన నాణ్యతపై నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి ఆరా.

గర్భిణీలకు అందుతున్న పోషకాలపై మాజీ ఎమ్మెల్యే భూమా పరిశీలన.

అంగన్వాడీ సేవలు మెరుగుపర్చాలని సూచన

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి అవసరం.. మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి.

నంద్యాల ,(కింగ్ )

నంద్యాల పట్టణంలోని నూనెపల్లి ప్రాంతంలో ఉన్న పలు అంగన్వాడీ కేంద్రాలు, ఠాగూర్ ప్రాథమిక పాఠశాలను మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి శనివారం సందర్శించి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, ఆహార నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలపై సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా విద్యార్థులతో మమేకమైన ఆయన, వారికి అందుతున్న విద్యా సదుపాయాలు, పాఠశాలలో ఉన్న మౌలిక వసతుల గురించి ఆరా తీశారు. చిన్నారులకు అందించే ఆహారం పోషక విలువలతో కూడి ఉండాలని, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులు, సిబ్బందికి సూచించారు. అనంతరం పలు అంగన్వాడీ కేంద్రాలను సందర్శించిన భూమా బ్రహ్మానందరెడ్డి అక్కడ గర్భిణీ స్త్రీలు, బాలింతలకు అందిస్తున్న పోషకాహార సరఫరా,ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై వివరాలు తెలుసుకున్నారు.



అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారం నాణ్యతగా ఉండేలా చూడాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ప్రయోజనాలు చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రభుత్వం మహిళలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. పిల్లల విద్యాభివృద్ధి, మహిళల ఆరోగ్య సంరక్షణలో అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అంగన్వాడీ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్ యార్డు దుకాణాల బహిరంగ వేలంలో 4దుకానాలను దక్కించుకున్న గోళ్ళ రాజేష్ సేవా సమితి సభ్యులు.

నంద్యాల ,(కింగ్ )



నంద్యాల నియోజకవర్గ ప్రజలకు మరింత సేవ చేసేదిశలోనే 4దుకానాల వినియోగించనున్నాము..సమన్వయకర్త సీనియర్ రిపోర్టర్ నూర్ భాషా గోళ్ళ రాజేష్ కు పూలమాలలు, శాలువాలులతో ఘణంగా సత్కరించి సంతోషం వ్యక్తం చేసిన మీడియా మిత్రులు పట్టణంలోని టెక్కే వ్యవసాయ మార్కెట్ యార్డ్ కు సంబంధించిన పది దుకాణాలకు రెండవ విడత బహిరంగ వేలంపాట నిర్వహించారు. మార్కెట్ యార్డు జే.డి. ఆంజనేయులు సమక్షంలో మార్కెట్ యార్డ్ గుంటుపల్లి హరిబాబు అధ్యక్షతన కమిటీ సభ్యులు, అదికారులతో పాటు వేలంపాటలో పలువురు వ్యాపారస్తులు వేలం పాటలో పాల్గొన్నారు. ఈ నేపద్యంలో నంద్యాల వాసి అయిన గోళ్ళ రాజేష్ సేవా సమితి సభ్యులు మరొకసారి రెండో విడత నిర్వహించిన బహిరంగ వేలం పాటలో వ్యవసాయ మార్కెట్ యార్డు కు సంబంధించిన నాలుగు దుకాణాలను వేలంపాటలో దక్కించుకున్నారు.ఈ కార్యక్రమంలో నంద్యాల వాసి అయిన ప్రముఖ వ్యాపారవేత్త సామాజికవేత్త గోళ్ళ రాజేష్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మీడియా మిత్రులు పెద్ద ఎత్తున గోళ్ళ రాజేష్ పై అభిమానంతో పూలమాలలు శాలువాలతో ఘనంగా సత్కరించి తమ ప్రేమను చాటుకుని అభినందనలు తెలియజేశారు. మీడియా మిత్రులు ఈ సందర్భంగా గోళ్ళ రాజేష్ తనమీద ఇంత అభిమానం చూపిస్తున్న మీడియా మిత్రులు అందరికీ కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు గోళ్ళ రాజేష్ ఇలాగే ఎల్లప్పుడూ మీడియా మిత్రులందరి ప్రేమాభిమానాలు తనమీద ఇలాగే కలిగి ఉండాలని ఎల్లప్పుడూ కూడా మీడియా మిత్రులు అందరికీ మరింత సేవ చేసేందుకు ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటానని గోళ్ళ రాజేష్ వారితో మాట్లాడటం జరిగింది.

ఈ కార్యక్రమంలో గోళ్ళ రాజేష్ కార్య నిర్వాహకులు సమన్వయకర్త సీనియర్ రిపోర్టర్ నూర్ భాషా మాట్లాడుతూ నంద్యాల నియోజకవర్గ ప్రజలందరికీ గోళ్ల రాజేష్ మూడు సంవత్సరాలకుపైగా ఇప్పటివరకు ఎన్నో రకాల సేవ, సహాయ,ఆర్థిక,సహకారాలు అందిస్తూ వస్తున్నారని అదేవిధంగా విలేకరులకు అందరికి కూడా తన వంతు సహాయంగా గౌరవ ఆర్థిక సహకారం అందిస్తున్నారని ఇలా రానున్న రోజుల్లో మరిన్ని సేవా సహాయ సహకారాలు అందించేందుకు ప్రజలకు సహాయం చేసేందుకు మరింత చేరువయ్యేలా ఉండాలని ఉద్దేశంతో మార్కెట్ యార్డ్ రెండవ విడత బహిరంగ వేళల్లో నాలుగు దుకాణాలు దక్కించుకున్నట్టు ఈ నాలుగు దుకాణాలను కూడా వ్యాపారాలకోసం కాకుండా నంద్యాల నియోజకవర్గ ప్రజలకు సేవ చేసేలా ఈ దుకాణాలను రానున్న రోజుల్లో వినియోగించుకోబోతున్నామని తెలిపారు. అదే విధంగా నంద్యాల నియోజకవర్గ ప్రజలందరూ కూడా గోళ్ళ రాజేష్ ని ఎప్పుడు ఆదరిస్తూ తమ ప్రేమాభిమానాలను అందిస్తూ ఆశీర్వదాన్ని అందిస్తూ ఉండాలని ఈ సందర్భంగా నూర్ భాషా తెలిపారు.

# రైతు సంక్షేమానికి పెద్దపీట.. నంద్యాల జిల్లాలో 2.06 లక్షల మంది రైతులకు రూ.139.41 కోట్ల ఆర్థిక సహాయం

అన్నదాతకు అండగా ప్రభుత్వం.. ప్రతి అర్హ రైతుకు ఏడాదికి రూ.20 వేల ఆర్థిక భరోసా

వ్యవసాయాభివృద్ధే లక్ష్యం.. రైతుల ఖాతాల్లో భారీగా నిధుల జమ

అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్‌తో రైతు కుటుంబాలకు ఆర్థిక భద్రత

రైతు సంక్షేమం, భూసార పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు - జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి

నంద్యాల ,(కింగ్ )

రైతుల ఆర్థిక స్థిరత్వం, వ్యవసాయ రంగాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న "అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్" పథకం ద్వారా నంద్యాల జిల్లాలో అర్హులైన రైతులకు భారీ స్థాయిలో ఆర్థిక సహాయం అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. శనివారం నంద్యాల మండలం పోలూరు గ్రామంలో నిర్వహించిన "అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్" పథకం కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు నంద్యాల పార్లమెంటు సభ్యురాలు బైరెడ్డి శబరి వ్యవసాయం, అనుబంధ హౌరంగాల అధికారులుహౌపాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మొత్తం 2,06,052 మంది రైతులకు రూ. 139.41 కోట్ల ఆర్థిక



సహాయం రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ. 103.03 కోట్లు, కేంద్ర ప్రభుత్వం తరపున రూ. 36.39 కోట్లు అందించబడినట్లు పేర్కొన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచడం, సాగు ఖర్చులను తగ్గించడం, వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకం కింద అర్హులైన ప్రతి రైతుకు సంవత్సరానికి రూ. 20 వేల ఆర్థిక సహాయం మూడు విడతలుగా అందజేస్తున్నట్లు వివరించారు. తొలి, రెండో విడతల్లో కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 2 వేలు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ. 5 వేలు చొప్పున మొత్తం రూ. 7 వేల చొప్పున, మూడో విడతలో కేంద్రం నుంచి రూ. 2 వేలు, రాష్ట్రం నుంచి రూ. 4 వేలు కలిపి రూ. 6 వేలు అందజేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో అత్యధికంగా ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని 42,981 మంది రైతులకు రూ. 29.10 కోట్లు, బనగానపల్లె నియోజకవర్గంలోని 40,664 మంది రైతులకు రూ. 27.41 కోట్లు, నంద్యాల నియోజకవర్గంలోని 36,734 మంది రైతులకు రూ. 24.94 కోట్లు అందించగా, డోన్ నియోజకవర్గంలోని 35,011 మంది రైతులకు రూ. 23.40 కోట్లు, శ్రీశైలం నియోజకవర్గంలోని 25,018 మంది రైతులకు రూ. 17.06 కోట్లు, నందికొట్కూరు నియోజకవర్గంలోని 12,953 మంది రైతులకు రూ. 8.79 కోట్లు, పాణ్యం నియోజకవర్గంలోని 12,691 మంది రైతులకు రూ. 8.72 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు. వ్యవసాయ ఉత్పాదకత పెరగాలంటే భూసారాన్ని కాపాడుకోవడం అత్యంత అవసరమని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం యూరియా, డి.ఎ.పి., కాంప్లెక్స్ ఎరువులను భారీ సబ్సిడీపై అందిస్తున్నప్పటికీ, వాటిని మితిమీరిన స్థాయిలో వినియోగించడం వల్ల భూమి సారవంతత తగ్గే ప్రమాదం ఉందన్నారు. భూముల్లో జింక్, సూక్ష్మపోషకాలు, కర్బన శాతం లోపిస్తున్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారని, రైతులు పచ్చిరొట్ట పంటలు సాగు చేయడం, సేంద్రీయ ఎరువుల వినియోగాన్ని పెంచడం ద్వారా భూసారాన్ని పరిరక్షించాలని సూచించారు. పోలూరు గ్రామంలో ప్రజలు ప్రస్తావించిన సమస్యలపై స్పందించిన కలెక్టర్, పాఠశాల చుట్టూ వర్షపు నీరు నిలిచిపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటికే రూ. 5 లక్షలతో అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. పాఠశాల మైదానం లెవెలింగ్ అంశాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామంలోని సీసీ రోడ్లపై నీరు నిలిచే సమస్యను సాంకేతిక నిపుణులతో పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు. అలాగే పొలాల రహదారుల నిర్మాణానికి సంబంధించి ఉపాధి హామీ పథకం సాఫ్ట్‌వేర్‌లో జూలై 1 నుంచి అమల్లోకి రానున్న మార్పుల అనంతరం అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. గ్రామాభివృద్ధి అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రజల భాగస్వామ్యం, సహకారం ఉంటేనే గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. రైతులు, ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని గ్రామాభివృద్ధికి తోడ్పడాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ, రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతు బాగుంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. రైతుల కష్టాలను అర్థం చేసుకున్న కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకాల ద్వారా ఆర్థిక సహాయాన్ని నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తోందని తెలిపారు. పోలూరు గ్రామ అభివృద్ధికి అవసరమైన రోడ్లు, నీటి పారుదల, పాఠశాల మౌలిక వసతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామ సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువస్తే నిధుల మంజూరుకు తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు.

# ప్రతి ఒక్కరూ ప్రతిరోజు యోగా అలవాటు చేసుకోవాలి పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస యాదవ్

కోవెలకుంట్ల: ,(కింగ్ )



కోవెలకుంట్ల పట్టణంలోని ఆదర్శ పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస యాదవ్ ఆధ్వర్యంలో అఖిల భారతీయ సాహసంఘటన కార్యదర్శి డాక్టర్ ఆర్ మురళీ కృష్ణ ముఖ్య వ్యక్తిగా విచ్చేసి విద్యార్థులకు ఆరోగ్యంగా ఎలా ఉండాలి మన యొక్క కుటుంబాలు ఎలా ఆరోగ్యంగా ఉండాలి మనము మన యొక్క పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటూ, మన ఊరిని శుభ్రంగా ఉంచుతూ ఆరోగ్యభారతిని ఆరోగ్య భారతాన్ని నిర్మించాలని కోరారు. ఆళ్లగడ్డ నుంచి విచ్చేసిన రాధాకృష్ణ తమ ఉపన్యాసంలో విద్యార్థులు ఆరోగ్య అలవాట్లు కలిగి ఉండాలని కోరారు ఆరోగ్య భారతి ప్రాంత కార్యదర్శి డాక్టర్ ఎంబీబీఎన్ రామశర్మ పాల్గొని ప్రసంగించారు. స్థానిక ఆర్ఎస్ఎస్ పరివార క్షేత్ర కార్యకర్తలు పాల్గొన్నారు విద్యార్థులు యోగాసనాలు ప్రదర్శన చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు బృందం విద్యార్థులతో కార్యక్రమాన్ని చక్కగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సత్సంగ ప్రముఖు వై బాలదిరాజు మరియు ఆర్ఎస్ఎస్ విష్ణు మనోహర్ మరియు లాయర్ తిరుపతయ్య పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రూ 12 వేల రూపాయల విరాళం.

రుద్రవరం. ,(కింగ్ )




మండల కేంద్రం రుద్రవరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు దాతలు రూ 12 వేల రూపాయలను విరాళంగా అందజేశారు. రుద్రవరంలోని ఉన్నత పాఠశాలలో హెడ్మాస్టర్ గా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ చేసినఆర్ కొత్తపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత హెడ్మాస్టర్ దివంగతగంధం రామిరెడ్డి మనవడు ఇండియన్ పెట్రోల్ ఆయిల్ బంక్ ప్రొప్రైటర్ గంధం బ్రహ్మానందరెడ్డి కుమారుడు గంధం యశస్వి రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఉన్నత పాఠశాలలో ఉన్న మెయిన్ గేటు మరమ్మతల కోసం రూ 12 వేల నగదును ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ వెంకటరమణకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి పరిచేందుకుతమ వంతు సహాయంగా ఈ విరాళాన్ని అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

# స్వర్గధామం వైకుంఠ రథం కోసం పదిలక్షలు సహాయం చేసిన గోళ్ళ రాజేష్.

నంద్యాల ,(కింగ్ )



నంద్యాలలో భీమవరం రాస్తాలో మరియు బస్టాండ్ దగ్గర నంద్యాల నవనిర్మాణ సమితి నిర్వహిస్తున్న రెండు హిందూ స్మశాన వాటికలను లిస్వర్గధామం" అన్న పేరుతో పది సంవత్సరాల నుంచి జీర్ణోద్దరణ చేసి నిర్వహణ చేస్తున్న విషయం మీకు అందరికీ తెలుసు. అందులో మానవతా సంస్థ వాళ్ళు ఇచ్చిన వైకుంఠ రథం ఒకటే ఉన్నది. నంద్యాల చుట్టుపక్కన 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న పల్లెటూర్లకు కూడా ఫ్రీజర్ బాక్స్, వైకుంఠ రథం సేవలను పెంపొందించుటకు మేము అడగగానే స్పందించి మృతి చెందిన ప్రతి హిందువు యొక్క ఆత్మను భగవంతునిలో పంచభూతాలలో ఐక్యమయ్యేటువంటి స్వర్గధామానికి రెండవ వైకుంఠ రథం ఇవ్వడానికి ముందుకు వచ్చి వెంటనే స్పందించి పది లక్షల రూపాయల చెక్కును మధుమణి నర్సింగ్ హోమ్ నందు స్వర్గధామం సభ్యులకు అందచేయడం జరిగింది.

గోళ్ళ రాజేష్ విశాల హృదయానికి, సమాజ సేవకు, నిష్కలంకమైన హృదయానికి నిదర్శనం. గోళ్ళ రాజేష్ గారు చేస్తున్నటువంటి ఈ సేవా కార్యక్రమానికి నంద్యాల నవనిర్మాణ సమితి సభ్యులు అందరం కూడా కృతజ్ఞతాపూర్వక ధన్యవాదాలు చెబుతున్నారు.

ఈ సమావేశంలో స్వర్గధామం అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు, ఉపాధ్యక్షులు రాజశేఖర్ గారు, ఉపాధ్యక్షులు శేషుబాబు గారు, కార్యదర్శి గెలివి రామకృష్ణ గారు, ట్రెజరర్ కశెట్టి కృష్ణమూర్తిగారు, ద్వారకా వసంతు, షణ్ముఖ శ్రీనివాస్ ఇంకా స్వర్గధామం సేవకులు కూడా పాల్గొనడం జరిగింది.

# స్వచ్ఛంద సంస్థ ద్వారా అభాగ్యులకు అన్నదాన కార్యక్రమం

నంద్యాల ,(కింగ్ )



భాను స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు లయన్ దనాల రవికాంత్ బాబు ఆధ్వర్యం లో ఈ రోజు నా స్నేహితుడు మారుడి పూడి సత్తిబాబు జన్మదినం సందర్భం గా ఈరోజు దిక్కులేని అభాగ్యులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ఆర్థిక సహాయం చేసిన దాత మా నాన్న గారు శ్రీ దనాల గంగారాజు గారు వీరికి నా హృదయ పూర్వక ధన్యవాదములు

భాను స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు రవికాంత్ బాబు మాట్లాడుతూ ఈరోజు నా స్నేహితుడు సత్తిబాబు జన్మదినం మా అందరికీ పండుగ దినం, కావున ఈరోజు దిక్కులేని అభాగ్యులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం చాల సంతోషంగా ఉంది, ముఖ్యం గా

దాతలు మానవత్వంతో ముందుకు వచ్చి వారి వంతు సహాయ సహకారం అందిస్తే పేదలకు మరిన్ని సేవ కార్యక్రమాలు చేయడానికి భాను స్వచ్ఛంద సంస్థ ముందు ఉంటుంది అని చెప్పడం జరిగింది ఈ కార్యక్రమం లో పాల్గొన సభ్యులు సిద్దిక్, విజయ పాల్, జయరావు తదితరులు పాల్గొన్నారు

# స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా పారిశుధ్య కార్యక్రమాలు

**జిల్లావ్యాప్తంగా 4,600 కేంద్రాల్లో యోగాంధ్రకు విస్తృత ఏర్పాట్లు**

**యోగాంధ్ర-2026ను విజయవంతం చేయాలి : కలెక్టర్ రాజకుమారి గణియా**



నంద్యాల ,(కింగ్ )

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా శనివారం నంద్యాల పట్టణంలోని రైల్వే స్టేషన్ పరిసరాలు, ప్రధాన వీధులు, ప్రజా ప్రదేశాల్లో నిర్వహించిన పారిశుధ్య కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్‌హా జి. రాజకుమారి, నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు స్వయంగా పరిశుభ్రత కార్యక్రమాల్లో పాల్గొని ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ గత ఏడాది జనవరిలో ప్రారంభమైన "స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం జిల్లాలో నిరంతరంగా కొనసాగుతోందని తెలిపారు. పరిశుభ్రమైన పరిసరాల నిర్మాణంలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించడం, ప్రజా ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని ప్రజలకు సూచించారు.

# అందరి సహకారంతోనే నగర పరిశుభ్రత

**జిల్లా కలెక్టర్, నగరపాలక ప్రత్యేక అధికారిణి డాక్టర్ ఏ. సిరి**

**కలెక్టరేట్ ప్రాంగణంలో స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం- పారిశుద్ధ్యంపై ప్రజల్లో అవగాహన పెరగాలి**

**వీధుల్లో వ్యర్థాలు వేస్తే జరిమానా తప్పదు**





కర్నూలు కార్పొరేషన్, ,(కింగ్ )

ప్రజలందరి సహకారంతోనే నగర పరిశుభ్రత సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్, నగరపాలక ప్రత్యేక అధికారిణి డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ ప్రాంగణంలో కలెక్టర్, కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ప్రజలు, ఉద్యోగులచే స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గత నాలుగు వారాలుగా వివిధ అంశాలతో ఆపరేషన్ క్లీన్ స్వీప్ ప్రత్యేక కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశామని, ఇది ప్రత్యేక డ్రైవ్‌గా కాకుండా నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందన్నారు. పారిశుద్ధ్యంపై ప్రజల్లో అవగాహన పెరగాలని, చెత్తను ఎక్కడబడితే అక్కడ వేయకుండా తడి, పొడి, హానికరమైన, ప్రత్యేకమైన వ్యర్థాలను వేర్వేరుగా చేసి మున్సిపల్ వాహనాలకే అప్పగించడం విధిగా భావించాలని సూచించారు. పర్యావరణానికి హాని కలిగించే వ్యక్తులకు జరిమానాలు విధించే అధికారాలను దేశ అత్యున్నత న్యాయస్థానం కలెక్టర్లకు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఎవరైనా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు. కమిషనర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆపరేషన్ క్లీన్ స్వీప్ పేరుతో గత నాలుగు వారాలుగా ప్రతి శనివారం ప్రత్యేక థీమ్‌తో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. రహదారులు, జంక్షన్లు, రెడ్–యెల్లో స్పాట్ల శుభ్రత, కాలువలు, డ్రైన్లు, వీధుల పరిశుభ్రత, వ్యర్థాల వర్గీకరణపై అవగాహన, మార్కెట్లు, వాణిజ్య ప్రాంతాల పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టామన్నారు. చివరి వారంలో ప్రజా మరుగుదొడ్ల పరిశుభ్రత, చెత్త పేరుకుపోయిన ప్రాంతాల శుభ్రత పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. నగర శుభ్రత కోసం ప్రభుత్వం, నగరపాలక సంస్థ, పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న కృషిని ప్రజలు గుర్తించి సహకరించాలని కమిషనర్ కోరారు.కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, సానిటరీ సూపర్వైజర్ రమేష్ బాబు, డీఈఈలు పవన్ కుమార్ రెడ్డి, కృష్ణలత, ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు, ఎంటమాలజిస్ట్ సత్యనారాయణ, స్వచ్ఛ సర్వేక్షణ్ కోఆర్డినేటర్లు శ్రీనివాసులు, జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో పోలీసులు రాజకీయ తొత్తులుగా మారారు

## వైసీపీ లీగల్ సెల్



నంద్యాల ,(కింగ్ )

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వంలో పోలీసులు రాజకీయ తొత్తులుగా మారారని నంద్యాల లీగల్ సెల్ నాయకులు సంచలన వ్యాక్యలు చేశారు. శనివారం నంద్యాలలోని స్థానిక వైసీపీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ లీగల్ సెల్ ప్రతినిధుల సమావేశం నిర్వహించడం జరిగింది. సమావేశంలో నంద్యాల జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు రామసుబ్బయ్య, నంద్యాల అధ్యక్షుడు ప్రతాప్రెడ్డి, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ శ్రీనివాసులు స్టేట్ అఫీషియల్ స్పోక్స్ పర్సన్ తిమ్మారెడ్డి, ఆర్టీఏ నంద్యాల అసెంబ్లీ వింగ్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, గ్రీవెన్స్ సెల్ అసెంబ్లీ అధ్యక్షుడు వివేకానందరెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ జగన్ మోహన్ రెడ్డి, సాయిరాం రెడ్డి, మదాని, సోహేల్ రాణా, ద్వారకానాథ్, శరత్, రామాంజనే యులు, వసంత్ రెడ్డి, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నంద్యాల వైసీపీ లీగల్ సెల్ నాయకులు మాట్లాడుతూ...రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో అరాచకాలు, దౌర్జన్యాలు, సోషల్ మీడియా ఆక్టివిస్ట్లపై వైసీపీ నాయకులు, కార్యకర్తలపై అనవరస కేసులు నమోదు చేస్తు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. సమాజంలో పోలీసుల పాత్ర అత్యంత ప్రధానమైనదని, అయితే నేడు కూటమి ప్రభుత్వంలో వారు రాజకీయతొత్తులుగా మారారని సంచల వ్యాక్యలు చేశారు. ఇటీవల కృష్ణలంక పోలీస్ స్టేషన్ లో కృష్ణవంశీ అనే యువకున్ని లాకప్ డెత్ జరిగిన ఘటన రాష్ట్రంలో సంచలనంగా మారింది. పోలీసుల చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వెళ్లి మృతుని కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి కృష్ణ వంశీ లాకప్ డెత్ గురించి తెలుసుకోవడం జరిగిందని అంతవరకు కనీసం స్పందించని పోలీసులు నేడు కృష్ణలంక సీఐపై కేసు నమోదు చేశారన్నారు. పోలీసు వ్యవస్థ రాష్ట్రంలో నిర్వీర్య అయ్యిందని విమర్శించారు. రాష్ట్రంలో మంత్రులు ఉన్నా అందరిని కేవలం మంత్రి లోకేష్ నియంత్రించడం జరుగుతుందని వారు పేరుకు మాత్రమే మంత్రులన్నారు. జూనియర్ న్యాయవాధుల విషయంలో నాడు వైసీపీ ప్రభుత్వం 5వేల రూపాయలను ఇవ్వడం జరిగిందని, అయితే ఎన్నికల సందర్భంగా జూనియర్ న్యాయవాధులకు నెలకు 10వేల రూపాయలు ఇస్తానని నమ్మించి నేటికి ఇవ్వలేదని మోసం చేశారని విమర్శించారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన వాగ్ధానాలను హామీలను నెరవేర్చలేదని పేర్కొన్నారు. డీఎస్సీ నియామకాల్లో మోసాలు, రైతులకు అన్యాయం చేశారని పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం లేదని కేవలం వైసీపీ నాయకులను, కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేయడమే పనిగా పెట్టుకున్నారని ఎద్దేవాచేశారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తున్నదని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు.

# పోలీస్ కార్యాలయాల్లో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

## పరిశుభ్రతలో పోలీసులు ఆదర్శంగా నిలవాలి : ఎస్పీ సునీల్ షొరాణ్

నంద్యాల ,(కింగ్ )



రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర ▪ స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నంద్యాల జిల్లావ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లు, పోలీస్ కార్యాలయాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంతో పాటు డీసీఆర్‌బీ, స్పెషల్ బ్రాంచ్, పాస్‌పోర్ట్, సైబర్ క్రైమ్, సాయుధ బలగాలు, మోటార్ వెహికల్ విభాగాల కార్యాలయాలు మరియు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో అధికారులు, సిబ్బంది పరిశుభ్రత కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యాలయ ప్రాంగణాలను శుభ్రపరిచి మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఇంటిని ఎలా పరిశుభ్రంగా ఉంచుకుంటామో విధులు నిర్వహించే కార్యాలయాలను కూడా అదే విధంగా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పరిశుభ్రమైన వాతావరణం ఆరోగ్యానికి మేలు చేయడంతో పాటు అంటువ్యాధులు, విషజ్వరాల నివారణకు దోహదపడుతుందని తెలిపారు. ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంచేందుకు పోలీసులు నిరంతరం సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు.

"This newspaper/periodical is published by KALIDINDI RAJA JAGADESHWAR SANTOSH from D. NO. 24-11/2-14, LANKAVARI VEEDHI, BHAVAJIPETA, 4TH LINE, NEAR MAHALAXMIGUDI, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520003.on behalf of KALIDINDI RAJA JAGADESHWAR SANTOSH, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by PETTA VENKATA SURYANARAYANA at SREE SESHASAI ENTERPRISES. 3-88, CHANDRA THEATRE, MAIN ROAD, GOSALA, KRISHNA, ANDHRA PRADESH - 521151."